
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

గుంటూరు జిల్లా వార్తలు

5

శనివారం 22 ఫిబ్రవరి 2025



సమన్వయంతో సాగండి
- పీఓలను మైక్రో అబ్జర్వర్లు సమన్వయం చేసుకోవాలి
- ఎమ్మెల్సీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి నాగలక్ష్మి

8

బ్యాంకులను బతికించండి
- గుంటూరులో ఉద్యోగుల నిరసన ప్రదర్శన

ప్రతి ఓటూ.. ప్రతిష్ఠాత్మకమే



- కొత్తగా చేరిన లక్ష ఓట్లు
- గత ఎన్నికలో చెల్లనవి అధికం
- కలసి కదులుతున్న కూటమి నేతలు
- సిట్టింగ్ స్థానం నిలుపుకునేందుకు పీడీఎఫ్ యత్నాలు
- మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు శ్రేణులతో సమీక్షలు
- పట్టభద్రులను కలసి మద్దతు కోరుతున్న అభ్యర్థులు

(నరసరావుపేట, గుంటూరు- ఆంధ్రజ్యోతి)

కృష్ణా.. గుంటూరు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను కూటమి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా భావిస్తోంది. అధికారంలో ఉండటం. శాసనసభ ఎన్నికల్లో స్వీప్ చేయడంతో ఎమ్మెల్సీ స్థానాన్ని కూడా కైవశం చేసుకోవడానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తోంది. మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను కూటమి బరిలో దింపింది. కూటమి హైకమాండ్ నుంచి స్పష్టమైన ఆదేశాలు రావడంతో, ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులు ఎమ్మెల్సీ ఎన్నికలపై ప్రత్యేక దృష్టి సారించారు. అదే విధంగా సిట్టింగ్ స్థానాన్ని తిరిగి నిలబెట్టుకునేందుకు పీడీఎఫ్ సర్వశక్తులు ఒడ్డుతోం ది. ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావును పీడీఎఫ్ పోటీలో నిలిపింది. ఇటు కూటమి.. అటు పీడీఎఫ్ పట్ట భద్రులైన ఓటర్లను ఆకట్టుకునేందుకు వ్యూహాత్మకం గా వ్యవహరిస్తున్నారు. దీంతో ఎమ్మెల్సీ ఎన్నికలు ఆసక్తికరంగా మారాయి.

ప్రతి ఓటూ కీలకమే..

2019 పట్టభద్రుల ఎన్నికల్లో గతంలో చెల్లని ఓట్లు ఎక్కువగా ఉన్నాయి. దీనిని దృష్టిలో ఉంచుకొని, ఈ సారి అభ్యర్థులు ప్రతి ఓటు చెల్లేలా ఓటర్లకు అవగాహన కల్పిస్తున్నారు. గత ఎన్నికల్లో 13,509 ఓట్లు చెల్లలేదు. 2,48,799 ఓట్లు ఉండగా 1,49,319 ఓట్లు మాత్రమే పోలయ్యాయి. 60 శాతం ఓట్లు మాత్రమే పోలు కావడంతో ఈసారి పోలింగ్ శాతాన్ని పెంచే దిశ గా ఓటర్లకు అవగాహన కల్పిస్తూ ఓటుకు వచ్చేలా ప్రయత్నిస్తున్నారు. చెల్లని ఓట్ల సంఖ్య తగ్గించే దిశగా కూడా అభ్యర్థులు ప్రయత్నిస్తున్నారు. ఓటు వేసే విధానంపై కూడా ప్రచారం నిర్వహిస్తున్నారు.

ముఖ్య నేతలకు లోకేష్ ఫోన్

యువనేత నారా లోకేశ్ ప్రాతినిధ్యం వహిస్తున్న మంగళగిరి అసెంబ్లీ స్థానం కూడా ఈ ఎన్నికల పరిధిలో ఉండటంతో అయన కూడా ఎంతో ప్రతిష్ఠాత్మకంగా తీసుకొని కూటమి అభ్యర్థి విజయం కోసం కృషి చేస్తున్నారు. రెండు ఉమ్మడి జిల్లాల్లోని ముఖ్య నేతలకు ఆయన నేరుగా ఫోన్ చేసి పార్టీ అభ్యర్థి విజయం కోసం శ్రమించాల్సిందిగా ఆదేశిస్తున్నారు. ఈ నియోజకవర్గ పరిధిలో ఉన్న మంత్రులు నాదెండ్ల మనోహర్, అనగాని సత్యప్రసాద్‌తో పాటు పల్నాడు జిల్లా ఇన్‌ఛార్జ్‌గా వ్యవహరిస్తున్న మంత్రి గొట్టిపాటి రవికుమార్ కూడా రాజా గెలుపు కోసం అవిశ్రాంతంగా కృషి చేస్తున్నారు. వీరితో పాటు ఇతర జిల్లాలకు చెందిన టీడీపీ సీనియర్ నేతలు మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, మాజీ మంత్రి పరిటాల సునీత తనయుడు పరిటాల శ్రీరామ్ తదితరులను కూడా యువనేత లోకేశ్ రంగంలోకి దించి ప్రచారం నిర్వహింప చేస్తున్నారు. ఇక ఉమ్మడి గుంటూరు జిల్లాలోని టీడీపీ ఎమ్మెల్యేలతో పాటు ఆయా నియోజకవర్గాల్లోని జనసేన, బీజేపీ నేతలు కూడా ఇప్పటికే తమ నియోజకవర్గాల్లో పలు మార్లు సమావేశాలు నిర్వహించి రాజాను గెలిపించాల్సిందిగా కోరటం జరిగింది.

కొత్తగా చేరిన లక్ష ఓట్లు

2019తో పోలిస్తే ఈ సంవత్సరం లక్ష ఓట్లు కొత్తగా చేరాయి. 2019లో 2,48,799 ఓట్లు ఉండగా, ఈ సంవత్సరం 3,47,116 ఓట్లు నమోదయ్యాయి. 2,06,456 మంది పురుషులు, 1,40,615 మంది మహిళలు, ట్రాన్స్‌జెండర్లు ఓట్లు 25 ఉన్నాయి. కూటమి వార్డుల వారీగా ప్రత్యేక శిబిరాలను నిర్వహించి పట్టభద్రుల ఓట్లు చేర్చుకొనేందుకు సహకరించింది. దీంతో ఓట్ల సంఖ్య గణనీయంగా పెరిగింది. గతంలో ఉత్సాహం ఉన్నవారే ఓటు నమోదు చేసుకునేవారు. ఈ సారి నిర్వహించిన ప్రత్యేక అవగాహన కార్యక్రమాల కూడా ఓటర్ల సంఖ్య పెరగడానికి కారణమయింది. మొత్తం మీద పెరిగిన ఓట్లు ఏ అభ్యర్థికి అనుకూలంగా మారతాయో చూడాలి.

ప్రచారంలో బిజీగా నేతలు

ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ సమయం సమీపిస్తుండటంతో అన్ని పార్టీల అభ్యర్థులు విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు. కూటమి ఎమ్మెల్సీ స్థానాన్ని కైవశం చేసుకొనేందుకు ముమ్మర ప్రయత్నాలు చేస్తోంది. పోలింగ్ బూత్‌ల వారీగా ఉన్న ఓట్లను ప్రాతిపదికగా చేసుకొని ఒక ఇన్‌చార్జిని నియమిం చడంతో పాటు ప్రతి 30 మంది ఓటర్లకు ఒక బాధ్యుడిని ఏర్పాటు చేసి ఓటర్లను కలిసే కార్యక్ర మం చేపట్టింది. ఇప్పటికే కొన్ని పోలింగ్ బూత్‌ల పరిధిలో ప్రతి ఓటరుని కూటమి శ్రేణులు కలసి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధిని వివరిస్తూ మద్దతు కూడగడుతున్నారు. ప్రతి అసెంబ్లీ నియో జక వర్గానికి ఒక ఎన్నికల పరిశీలకుడిని కూటమి నియమించింది. వీరు ఎప్పటికప్పుడు ప్రచార సరళిని సమీక్షిస్తున్నారు. ప్రచారంలో ఎక్కడైనా లోటు పాట్లు ఉంటే పరిశీలకులు సరిదిద్దుతున్నారు. ఒక్కొక్క ఓటరును రెండు సార్లు అయినా కలసి సానుకూల ఓటింగ్ జరిగేలా ముమ్మర ప్రయత్నాలు చేస్తు న్నారు. టీడీపీ సెంట్రల్ కార్యాలయం నుంచి కూడా ఎప్పటికప్పుడు ఎన్నికల సరళిపై సమీక్షలను నిర్వహిస్తున్నారు. ఎమ్మెల్యేలు వారి నియోజకవర్గాల్లో విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు. ఆలపాటిని గెలిపించాలని స్వయంగా వారు పట్టభద్రులను కలసి ఓటు అభ్యర్థిస్తున్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, న్యాయవాద సంఘాలను కలసి జగన్ పాలనలో ఉద్యోగ వర్గాలకు జరిగిన నష్టాన్ని వివరిస్తూ కూటమి ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమా లను వివరిస్తున్నారు. కూటమి, పీడీఎఫ్‌కు ఈ ఎన్నికలు ప్రతిష్ఠాత్మకంగా మారడంతో ఆలపాటి రాజా.. లక్ష్మణరావు మధ్య పోటీ రసవత్తరంగా మారింది.

రోస్టర్‌లో.. తప్పులు నిరుద్యోగులకు తిప్పలు

- రోస్టర్ ప్రకటనలో లోపాలపై అభ్యర్థుల్లో కలవరం

ఈ నెల 23వ తేదీన ప్రారంభం కానున్న గ్రూప్-2 మెయిన్స్ పరీక్షలను వాయిదా వేయాలని నిరుద్యోగులు, గ్రూప్-2 అభ్యర్థులు వేడుకొంటు న్నారు. గత ప్రభుత్వం విడుదల చేసిన గ్రూప్- 2 నోటిఫికేషన్ లోపభూయిష్టంగా ఉందని, నోటిఫికేషన్‌పై నిరుద్యోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆ నోటిఫికేషన్ ప్రకారం అభ్యర్థుల ఎంపిక జరిగితే మెరిట్ అభ్యర్థులు తీవ్ర అన్యా యానికి గురవుతారని వారు ఆందోళన చెందుతున్నారు. రోస్టర్ సరిచేసేంత వరకూ మెయిన్స్ పరీక్షలు వాయిదా వేయాలంటూ రెండు రోజులుగా గుంటూరులో ఆందోళనలు చేస్తున్నారు. సరిగ్గా మెయిన్స్ పరీక్షకు ఒక్కరోజు ముందు, శుక్రవారం ఉదయం గుం టూరు కలెక్ట రేట్ ఎదుట వందల మంది అభ్యర్థులు ఆందోళనకు దిగారు.

ప్రభుత్వం పట్టించుకోవాలంటూ రోడ్డెక్కిన అభ్యర్థులు



గుంటూరు కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న గ్రూపు- 2 అభ్యర్థులు

- ఎన్నికలకు ముందు హడావుడిగా గత ప్రభుత్వం నోటిఫికేషన్
- గత ప్రభుత్వం తెచ్చిన జీవో. నెం. 77తో మరింత గందరగోళం
- సరిచేయాలని కొంతకాలంగా నిరుద్యోగుల అభ్యర్థన
- రెండు రోజుల్లో మెయిన్స్.. వాయిదా కోరుతూ ఆందోళన
- గుంటూరు కలెక్టరేట్ వద్ద నిరసనలు

గుంటూరు, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం ఎన్నికలకు ముందు హడావుడిగా గ్రూప్-2 నోటిఫికేషన్ జారీచేసింది. ప్రతి ఏటా జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తానని చెప్పిన గత ముఖ్యమంత్రి ఒక్క ఏడాది కూడా జాబ్ క్యాలెండర్ ఇవ్వకుండా, ఓటు బ్యాంకు రాజకీయాల్లో భాగంగా ఎన్నికలకు ముందు నిరుద్యోగులను బుజ్జగించడానికి, వారి ఓట్లు పొందడానికి అన్నట్లుగా ఎన్నికలకు ముందు హడావుడిగా గ్రూప్-2 నోటిఫికేషన్ జారీ చేశారు. ఈ నోటిఫికేషన్ చూసుకున్న నిరుద్యోగులు ఆందోళ నకు గురయ్యారు. నోటిఫికేషన్లో ప్రకటించిన రోస్టర్ పాయింట్లు తప్పుల తడకగా ఉన్నట్లు గుర్తించి, వాటిని సరిచేయాలని ఆందోళన చేపట్టారు. అప్పట్లో ప్రతిపక్షంలో ఉన్న తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్సీలు కూడా రోస్టర్ తప్పులను ప్రభు త్వానికి ఎత్తి చూపారు. అయిన ప్పటికీ యథావిధిగా గ్రూప్- 2 ప్రిలిమ్స్ పరీక్షలు జరిగిపోయాయి. ఆ తరువాత ఎన్నికల్లో ప్రభుత్వం మారింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఏపీపీఎస్సీ బోర్డులో మార్పులు జరిగాయి. దీంతో గ్రూప్- 2 నోటిఫికేషన్లో దొర్లిన తప్పులను ఏపీపీఎస్సీ సరి చేస్తుందని భావించారు. కానీ ఆ దిశగా ఏమీ జర గలేదు. దీంతో ఆందోళన చెందిన పలువురు గ్రూప్- 2 అభ్యర్థులు హైకోర్టును ఆశ్రయించారు. కేసును విచారిస్తున్న హైకోర్టు రోస్టరుపై నిర్దిష్టమైన తీర్పు ఏదీ ఇవ్వలేదు. కానీ పరీక్షల నిర్వహణను యథావిధిగా ఈ నెల 23 నుంచి కొనసాగించుకోవచ్చని సూచించింది. అప్పటి వరకూ కోర్టుపైనే ఆశలు పెట్టుకున్న నిరుద్యోగులు కోర్టు తీర్పుతో తీవ్ర కలవరానికి గురయ్యారు. ఆందోళనబాట పట్టారు.

● గత ప్రభుత్వం తెచ్చిన జీవోతో తంటా..

గత ప్రభుత్వం రూల్ ఆఫ్ రిజర్వేషన్లపై 2023 ఆగస్టులో జీవో. ఎంఎస్. నెం.77ను జారీ చేసింది. రిజర్వేషన్లలో భాగంగా మహిళలు, దివ్యాంగులు, ఎక్స్ సర్వీస్ మెన్‌లకు సంబంధించి వర్టికల్ రిజర్వేషన్‌ను అందులో ప్రకటించింది. జీవో ప్రకారం బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ అభ్యర్థుల ఎం పికలో మహిళలకు కేటాయించిన 33.33 శాతం వర్టికల్ రిజర్వేషన్‌ను అమలు చేస్తారు. అంటే ఆయా కేటగిరీలు, సబ్ కేటగిరీల్లో ఎంపిక చేసే అభ్యర్థుల్లో మూడో వంతు మహిళలకు కేటాయి స్తారు. ఇది గతం నుంచి అమలులో ఉన్నప్పటికీ గత వైసీపీ ప్రభుత్వం దీని కోసం ప్రత్యేకమైన జీవో తెచ్చింది. ఆ జీవోలో రోస్టర్ పాయింట్లను ప్రకటించింది. గతంలో అమలులో ఉన్న జీవో ప్రకారం వంద పాయింట్ల రోస్టర్ విధానంలో హారి జాంటల్ రిజర్వే షన్లో భాగంగా ఓసీ, బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈడబ్ల్యూఎస్ అభ్య ర్థులకు పోస్టులు కేటా యి స్తారు. అందులోనే వర్టికల్ రిజర్వే షన్ కోటా కింద 1/3 వంతు మహిళల కోటా పోస్టు లు కూడా ప్రకటిస్తారు. ఆ వంద పాయింట్ల రోస్టర్‌లోనే జనరల్ ఎన్ని, మహిళలు, ఇతర ప్రత్యేక రిజర్వేషన్ అభ్య ర్థులకు ఎన్ని అనేది స్పష్టంగా ఉంటుంది. కానీ వైసీపీ ప్రభుత్వం జారీ చేసిన జీవోలో పోస్టుల ఎదుట హారిజాంటల్ కేటగిరీ పోస్టులను ప్రకటించలేదు. దీంతో వర్టికల్ రిజర్వేషన్‌పై గ్రూప్-2 నోటిఫి కేషన్లో గందర గోళం నెలకొంది.

● ఆందోళనకు కారణం..

ప్రభుత్వం తాజాగా ప్రకటించిన గ్రూప్- 2 నోటిఫికేషన్లో ఉన్న మొత్తం పోస్టుల్లో 45 శాతం పోస్టులు మహిళలకే కేటాయించి ఉన్నాయని అభ్యర్థులు

(మిగతా 6వ పేజీలో)

● వైసీపీ నిర్వాకంతో.. నిరుద్యోగుల్లో నిస్పృహ

గత వైసీపీ ప్రభుత్వం ఏటా జాబ్ క్యాలెండర్ అని చెప్పి, ఐదేళ్లలో ఒక్క ఏడాది కూడా క్యాలెండర్ విడుదల చేయ లేదు. ఎన్నికలకు నాలుగు నెలల ముందు హడావుడిగా 2023 డి సెంబరు 7న గ్రూప్- 2 నోటిఫికేషన్ విడుదల చేసింది. అందులో కూడా నామమాత్రంగా 905 పోస్టులు మాత్రమే ఉన్నాయి. అందులో కీల కమైన గెజిటెడ్ పోస్టులు మున్సిపల్ కమిషనర్ 4, సబ్ రిజిస్ట్రార్ 16, లేబర్ ఆఫీ సర్ 28, పంచాయతీరాజ్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్ 2, కోఆపరేటివ్ సొసైటీస్ అసిస్టెంట్ రిజిస్ట్రార్ 16 పోస్టులు ఉండగా, డిప్యూటీ తహసీల్దార్ 114, ఎక్సైజ్ ఎస్సై 150 మాత్రమే ఉన్నాయి. డీటీ, ఎక్సైజ్ ఎస్సై పోస్టులు మినహా మిగిలిన అన్ని పోస్టుల్లో జనరల్ కేటగిరీకి, మహిళా కోటాకు సమానంగా పోస్టులు వస్తున్నాయి. ఐదేళ్ల తరువాత వచ్చిన నోటిఫికేషన్లో నామమాత్రంగానే పోస్టులు ఉండడం, అందులోనూ రిజర్వేషన్ లేకుండా పోవడంతో అభ్యర్థులు నిరాశకు గురవుతున్నారు. ఇదే పద్ధతి కొనసాగితే భవిష్యత్తులో వెలువడే నోటఫికేషన్లలో కూడా తమకు మేలు జరగదన్నా నిస్పృహ వారిని వెంటాడుతోంది.

వారబందీ అమలు చేయండి

- కలెక్టర్ అరుణ్‌బాబు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్


నరసరావుపేట, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : సాగు నీటి సరఫరాలో వారబందీ విధానాన్ని అమలు చేయాలని పల్నాడు జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు జలవనరుల శాఖ అధికారులను ఆదేశించారు. నీటి వినియోగంపై నియంత్రణ ఏదీ..? అనే శీర్షికతో ఆంధ్రజ్యోతిలో వెలువడిన కథనంపై స్పందిచిన ఆయన శుక్రవారం ఇరిగేషన్, వ్యవసాయ, ఉద్యాన వన, గ్రామీణ నీటి సరఫరా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలోని ప్రధాన రెండు రిజర్వాయర్లు నాగార్జున సాగర్.. పులిచింతలలో నీటి కొరత ఉందని , దీని కారణంగా సాగుకు నీటి సరఫరాలో వార బందీ ప్రక్రియను అమలు చేయాలన్నారు. సాగు నీటి వినియోగం పై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. నీటి విడుదల్లో తాగు నీటికి తొలి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. అన్ని చెరువులలో పూర్తి స్థాయి నీటి సామర్థ్యం మేరకు నీటిని నిల్వ చేయాలన్నారు. జిల్లాలోని అన్ని గ్రామాలకు మంచి నీటి ఇబ్బంది లేకుండా తాగు నీటి సఫరా చేయాలని ఆదేశించారు. నీరు వృధా, చెరువులలో నీరు లీకేజీ కాకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాకు ఎంత నీరు అవసరం ఉందో సదరు అధికారులను అడిగి తెలుసుకున్నారు. జిల్లా వ్యవసాయ అధికారి మురళీ, ఇరిగేషన్ శాఖ చీఫ్ ఇంజనీర్ శ్యాంప్రసాద్, ఈఈ లు మురళీ కృష్ణ, శ్రీహరి, ప్రేమ్ కుమార్, మురళీ, ఉద్యాన వన శాఖ అధికారి రామణా రెడ్డి, గ్రామీణ నీటి సరఫరా అధికారులు పాల్గొన్నారు.



జలవనరుల శాఖ అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

ఖరీఫ్ నాటికి.. కడగండ్లు తీరేనా?

- మరమ్మతుల కోసం కృష్ణాడెల్టా కాల్వల ఎదురుచూపు
- గత ఐదేళ్లలో తట్ట మన్నేసింది లేదు
- కట్టలన్నీ గండ్లుపడేంత బలహీనంగానే
- షట్టర్‌లు, కాంక్రీట్ స్ట్రక్చర్‌లయితే పూర్తిగా శిథిలమే
- అత్యవసర రిపేర్లకు ఓ.అండ్.ఎం నిధులు సరిపోవు
- ప్రత్యేక నిధుల మంజూరు చెయ్యాల్సిందే



8

తెనాలి: కంచర్లపాలెం వద్ద పంట కాల్వలో పేరుకుపోయిన గుర్రపుడెక్క, పిచ్చి కాడ

ఏ కాల్వ కట్ట చూసినా.. ఏమున్నది గర్వ కారణం అన్నట్టుంది కృష్ణా పశ్చిమ డెల్టాలోని కాల్వల పరిస్థితి. అంతా కడ'గండ్ల'మయమే. వీటి మరమ్మతులకు రూ. 40 కోట్ల నుంచి రూ. 50 కోట్ల వరకు నిధులు అవసరమౌతాయని ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపారు. వెంటనే అనుమతులు మంజూరు చేస్తే టెండర్ల ప్రక్రియను ఏప్రిల్లోపే పూర్తి చేసుకునే అవకాశం ఉంది. అప్పటి నుంచి జూలై వరకు పనులు చేసుకోవచ్చు. ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని రైతులు కోరుతుండగా, ప్రభుత్వం ఎలా స్పందిస్తుందో వేచి చూడాల్సిందే..

గుడ్డుకాయ స్వాహా





8

బర్డ్ ఫ్లూ పై ప్రజల్లో ఉన్న అపోహలు తొలగించేందుకు గుంటూరు పట్టాభిపురం స్వామి థియేటర్ గ్రౌండ్స్‌లో శుక్రవారం రాత్రి గుంటూరు జిల్లా పౌల్ట్రీ ఫార్మర్స్ అండ్ ట్రేడర్స్ అసోసియేషన్ ఏర్పాటు చేసిన చికెన్, గుడ్డు ఆహార మేళాకు జనం పోటెత్తారు.

అంబేడ్కర్ ప్రపంచ మేధావి



ప్రసంగిస్తున్న అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ఆచార్య గంటా చక్రపాణి

పెదకాకాని, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): భారతదేశానికి దశా, దిశా చూపిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ప్రపంచ మేధావిగా కీర్తి పొందారని అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ఆచార్య గంటా చక్రపాణి అన్నారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని సెంటర్ ఫర్ డాక్టర్ అంబేడ్కర్ చైర్ ఆధ్వర్యంలో శుక్రవారం అంబేడ్కర్ విజన్ ఇంటర్ ప్లే ఆఫ్ సోషియో, పొలిటికల్, ఎకనామిక్ ఫ్యాక్టర్స్ ఇన్ ఇండియా అనే అంశంపై రెండు రోజుల యూజీసీ జాతీయ సదస్సు ప్రారంభమైంది. ప్రారంభ కార్యక్రమానికి వర్సిటీ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎం.సురేష్ కుమార్ అధ్యక్షత వహించారు. ఆచార్య గంటా చక్రపాణి మాట్లాడుతూ భారత రాజ్యాంగం ప్రోగ్రెసివ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టుగా ఆయన అభివర్ణించారు. ముఖ్యఅతిథి ఇన్‌చార్జి వీసీ ఆచార్య కె.గంగాధరరావు మాట్లాడుతూ భారత రాజ్యాంగం చాలా గొప్పదన్నారు. రెక్టార్ ఆచార్య కె.రత్నషీలామణి, ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం, అంబేడ్కర్ చైర్ ప్రొఫెసర్, సెమినార్ డైరెక్టర్ ఆచార్య వై.అశోక్ కుమార్, సెమినార్ కోశాధికారి డాక్టర్ కె.అబ్రహం లింకన్, అంబేడ్కర్ చైర్ పూర్వ విభాగాధిపతి ఆచార్య నాలాది శామ్యూల్, గాంధీ అధ్యయన కేంద్రం పూర్వ సంచాలకులు డాక్టర్ కె.సోమశేఖర్, ఆర్ట్స్ కళాశాల పూర్వ ప్రిన్సిపాల్ ఆచార్య చల్లపల్లి స్వరూప రాణి, నూటా అధ్యక్షుడు డాక్టర్ బట్టు నాగరాజు పాల్గొన్నారు.

మెరుగైన ఫలితాలు సాధించాలి



మాట్లాడుతున్న ఆర్ఐవో జుబేర్

గుంటూరు (విద్య), ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కళాశాలల్లో ఇంటర్ విద్యార్థులకు ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలు సద్వినియోగం చేసుకుని మెరుగైన ఫలితాలు సాధించాలని ఇంటర్ బోర్డు ఆర్ఐవో జీకే జుబేర్ సూచించారు. శుక్రవారం ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో నిర్వహించిన వార్షిక వేడుకల్లో ఆయన మాట్లాడారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనం, విద్యాశక్తి ద్వారా ఐఐటీ మద్రాసు సౌజన్యంతో జేఈఈఈ మెయిన్స్ అడ్వాన్స్ శిక్షణ అందిస్తున్నారని తెలిపారు. కార్పొరేట్ కళాశాలలకు దీటుగా ఫలితాలు సాధించాలని ఆయన సూచించారు. ప్రిన్సిపాల్ జి.సునీత మాట్లాడుతూ ఏటా తమ కళాశాల విద్యార్థులు 90శాతంపైగా ఉత్తీర్ణత సాధిస్తున్నారని తెలిపారు. ఈ సందర్భంగా శంకరరావు కృష్ణ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సైన్స్ ఆర్ట్స్ గ్రూపుల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు నగదు పురస్కారాలు మెమెంటోలు అందజేశారు. విద్యార్థినుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయమే లక్ష్యం

- మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు



ఉప్పలపాడులో ఎమ్మెల్సీ ఎన్నికల కరపత్రాలు విడుదల చేస్తున్న మాజీ మంత్రి దేవినేని ఉమ, పార్టీ నాయకులు

పెదకాకాని, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి బలపరిచిన అభ్యర్థి విజయమే లక్ష్యంగా పాటుపడాలని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు అన్నారు. పెదకాకాని మండలం ఉప్పలపాడులో మండల నాయకులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాధారణ ఎన్నికల్లో ఉపాధ్యాయుల ఆశీస్సులతోనే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందన్నారు. ఇప్పుడు ఉమ్మడి కృష్ణా-గుంటూరు ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను గెలిపించేలా శాసనసభ్యులు ధూళిపాళ్ల నరేంద్ర నేతృత్వంలో సమష్టిగా పాటుపడాలన్నారు. మిర్చి రైతుల సమస్యలను సీఎం చంద్రబాబు కేంద్రం దృష్టికి తీసుకెళ్లారనీ, మిర్చి ఎగుమతులు పెంచేందుకు ఉన్న అవకాశాలను పరిశీలిస్తున్నామన్నారు. మిర్చి రైతుల సమస్యలపై శివరాజ్ సింగ్ చౌహాన్‌తో సుదీర్ఘ సమావేశం జరిగిందన్నారు. చంద్రబాబు నాయుడు జోక్యంతో 25 శాతం ఉన్న సీలింగ్‌ను ఎత్తివేసేందుకు, 75 శాతం మేర కొనుగోలు చేసేందుకు కేంద్రం అంగీకరించిందని చెప్పారు. నాడు జగన్ చేసిన పాపాలు రాష్ట్రానికి శాపాలుగా మారాయని, పోలవరంలో జగన్ చేసిన తప్పిదాలను చంద్రబాబు నాయుడు సరిచేస్తున్నారన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ ఎ.ఎస్.రామకృష్ణ, మన్నవ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

వెనిగండ్లలో ప్రచారం

ఉపాధ్యాయులు గత వైసీపీ హయాంలో చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నారని, వారిపై యాప్‌ల భారం విపరీతంగా ఉందని, ఇక ఆ యాప్‌ల భారం తొలగించాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించిందని మాజీ మంత్రి, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవినేని ఉమామహేశ్వరరావు వివరించారు. వెనిగండ్ల జిల్లా పరిషత్ హైస్కూల్ వద్ద ఉపాధ్యాయులు పట్టభద్రులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ పేరుతో స్కూల్ కిట్లు అందజేశామని, డొక్కా సీతమ్మ పేరుతో మధ్యాహ్న భోజన పథకం తీసుకువచ్చారని గుర్తు చేశారు. ఇది కోరి తెచ్చుకున్న కూటమి ప్రభుత్వమని స్పష్టం చేశారు.

రీసైక్లింగ్‌పై విస్తృత పరిశోధనలు తప్పనిసరి



జాతీయ సదస్సు సావనీరును ఆవిష్కరిస్తున్న చైర్మన్ కృష్ణయ్య, వీసీ గంగాధరరావు

పెదకాకాని, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): రీసైక్లింగ్‌పై విస్తృత పరిశోధనలు తప్పనిసరి కావాలని ఏపీ కాలుష్య నియంత్రణ మండలి చైర్మన్ డాక్టర్ పి.కృష్ణయ్య అన్నారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని పర్యావరణ శాస్త్రం విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం "సామాజిక, ఆర్థిక, పర్యావరణ అభివృద్ధికి అవలంబించాల్సిన సుస్థిర విధానాలు" అనే అంశంపై ఏర్పాటు చేసిన రెండు రోజుల యూజీసీ జాతీయ సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరైన ఏపీ కాలుష్య నియంత్రణ మండలి చైర్మన్ డాక్టర్ పి.కృష్ణయ్య మాట్లాడుతూ మానవ జీవన విధానంలో పర్యావరణ పరిరక్షణ అంతర్భాగం కావాలన్నారు. వస్తువుల పునర్ వినియోగం అనేది భారత జీవన విధానంగా ఉండేదనీ, తిరిగి దానిని మళ్లీ కొనసాగించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. విశ్వవిద్యాలయాల్లో రీసైక్లింగ్ అంశంపై విస్తృత స్థాయిలో పరిశోధనలు చేయాలని సూచించారు. సదస్సుకు అధ్యక్షత వహించిన విశ్వవిద్యాలయం తాత్కాలిక ఉపకులపతి ఆచార్య కంచర్ల గంగాధరరావు మాట్లాడుతూ పురుగుమందుల వాడకాన్ని తగ్గించడంతోపాటు సేంద్రీయ వ్యవసాయానికి ప్రాధాన్యం ఇవ్వాలని అన్నారు. ఎస్ఆర్ఎం విశ్వవిద్యాలయ పర్యావరణ విభాగం డీన్ డాక్టర్ కె.రాజేంద్రన్ మాట్లాడుతూ కాలుష్య నివారణకు అనుసరిస్తున్న పద్ధతుల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మిషన్ లెర్నింగ్ ప్రయోజనకరంగా ఉన్నాయన్నారు. ఏఎన్యూ తాత్కాలిక రెక్టార్ ఆచార్య రత్నషీలా మణి, తాత్కాలిక రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం, జాతీయ సదస్సు సంచాలకులు ఆచార్య పి.బ్రహ్మాజీరావు మాట్లాడారు. తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర, ఏపీ, తెలంగాణ రాష్ట్రాల నుంచి 40 మంది పర్యావరణ నిపుణులు, అధ్యాపకులు, పరిశోధకులు సదస్సుకు హాజరై తమ పరిశోధన పత్రాలు సమర్పించారు. అనంతరం సదస్సు సావనీరును ఆవిష్కరించటంతో పాటు కృష్ణయ్యను ఘనంగా సన్మానించారు. సైన్స్ కాలేజి ప్రిన్సిపాల్ ఆచార్య కె.వీరయ్య, పర్యావరణ శాస్త్రం విభాగాధిపతి ఆచార్య ఏవీవీఎస్ స్వామి, పర్యావరణ విభాగ అధ్యాపకులు డాక్టర్ వి.సుభాషిని, డాక్టర్ కె.శశిధర్, భారతి దాసన్ విశ్వవిద్యాలయం అధ్యాపకులు ప్రొఫెసర్ వెంకటాచలం, మహారాష్ట్ర పెర్గో సన్ కళాశాల అధ్యాపకులు తన్వి యోగేష్ భరద్వాజ్, అమీర్ ముల్లా, ఆశిష్, మానవ వనరుల అభివృద్ధి విభాగ అధ్యాపకులు ఆచార్య తులసీదాస్, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రోస్టర్‌లో తప్పులు... నిరుద్యోగులకు తిప్పలు

(5వ పేజీ తరువాయి)

ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ప్రకటించిన వర్టికల్ రిజర్వేషన్ ప్రకారం మొత్తం పోస్టుల్లో 1/3వంతు పోస్టులు మాత్రమే మహిళలకు వెళ్లాలి. కానీ కొన్ని కేటగిరీల్లో సగానికి సగం మహిళలకు వెళుతున్నాయని, కొన్ని కేటగిరీల్లో మహిళలకు రావాల్సిన 1/3వ వంతు కూడా రావడంలేదని అభ్యర్థులు అంటున్నారు. నోటిఫికేషన్లో మొత్తం 905 పోస్టులు ఉండగా అందులో 140 పోస్టుల వరకూ రోస్టర్ గందరగోళం ఉన్నట్లు చెబుతున్నారు. జనరల్ కోటాలో 408 పోస్టులుండగా మహిళలకు రమారమి 112 పోస్టులు రావాల్సి ఉండగా, వారికి అదనంగా 25 పోస్టులు కలిసి 137 పోస్టులు వచ్చాయని, అవి జనరల్ అభ్యర్థులు నష్టపోయారని, ఎస్సీ కేటగిరీలో మహిళలకు 25 పోస్టులు రావాల్సి ఉండగా వారికి 7 పోస్టులు తగ్గి 18 పోస్టులు, ఈ డబ్ల్యూఎస్ కోటాలో 20 పోస్టులు మహిళలకు రావాల్సి ఉండగా, వారికి 5 పోస్టులు తగ్గి 15 పోస్టులు మాత్రమ వచ్చాయని అభ్యర్థులు ఆరోపిస్తున్నారు. కొన్ని కేటగిరీల్లో రెండు పోస్టులే ఉన్నాయి. అలాంటి చోట్ల ఒకటి జనరల్, ఒకటి మహిళలకు కేటాయించారు. అలాంటి ప్రత్యేక సందర్భంలో జనరల్ అభ్యర్థులు భారీగా పోస్టులు కోల్పోయారు. ప్రభుత్వం ప్రకటించిన రోస్టర్ విధానంతో నిరుద్యోగుల తలరాతలు మారిపోతున్నాయని వారు ఆందోళన చెందుతున్నారు. గత వైసీపీ నిర్వాకంతో ఐదేళ్లపాటు నోటిఫికేషన్లు లేక అల్లాడిపోయిన తమకు తాజా నోటిఫికేషన్ ప్రకారం రోస్టర్ అమలు జరిగితే ఇప్పుడే కాకుండా భవిష్యత్తులో కూడా అన్యాయం జరుగుతుందని వాపోతున్నారు. ప్రభుత్వం రోస్టర్ తప్పులను సరిచేసిన తరువాతే మెయిన్స్ పరీక్షలను నిర్వహించాలని వేడుకుంటున్నారు. కాగా ఈనెల 11వ తేదీన ఈ అంశంపై హైకోర్టులో తీర్పు వచ్చే అవకాశం ఉందని, అప్పటి వరకైనా మెయిన్స్ పరీక్షలు వాయిదా వేయాలని అభ్యర్థులు కోరుతున్నారు.

పాన్‌ఇండియా సైబర్ నేరగాళ్లు అరెస్టు

- రూ.1.9 లక్షలు, మూడు సెల్‌ఫోన్‌లు స్వాధీనం
- ఎస్పీ తుషార్ డూడి వెల్లడి



వివరాలను వెల్లడిస్తున్న ఎస్పీ తుషార్ డూడి

బాపట్ల, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): పాన్‌ఇండియా సైబర్ నేరగాళ్లను బాపట్ల జిల్లా పోలీసులు అరెస్టు చేశారు. వారి వివరాలను ఎస్పీ తుషార్ డూడి శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో విలేకర్లకు వివరించారు. వాట్సాప్‌లో ముఖ్యమంత్రి ఫొటోను ప్రొఫైల్ పిక్చర్‌గా (డీపీ) ఉపయోగించి మోసాలకు పాల్పడుతున్న వారి గుట్టు రట్టు చేసినట్లు చెప్పారు. నేపాల్‌కు చెందిన ఆచారి రంజిత్ సింగ్ ప్రస్తుతం నంద్యాల జిల్లా ఆళ్ళగడ్డలో స్థిరపడ్డాడు. ప్రకాశం జిల్లా కొమరోలు మండలం అల్లినగరం గ్రామానికి చెందిన ఆవుల మండ వెంకటనారాయణ, వెస్ట్‌ఢిల్లీ మహాత్మాగాంధీ క్యాంప్ పంజాబిబాగ్‌కు చెందిన జతిన్ వురఫ్ సాహిల్‌లు కలిసి గతేడాది డిసెంబరు నెలలో జిల్లాలోని చీరాల ఆనందపేటకు చెందిన వారికి ఫోన్ చేసి ఆరోగ్యప్రతినిధిగా నటించి ముఖ్యమంత్రి జననీ సురక్ష పథకం కింద రూ. 70 లక్షలు కేటాయించారని నమ్మించారు. మాయమాటలతో ప్రలోభపెట్టి ఫోన్ పే ద్వారా డబ్బులు బదిలీ చేయమని ఒప్పించారు. ఈ విధంగా ముగ్గురు బాధితుల నుంచి రూ. 1,64,724 బదిలీ చేయించుకున్నారు. దీనిపై చీరాల టుటౌన్ పోలీసుస్టేషన్‌లో అప్పట్లో కేసు నమోదైంది. ఎస్పీ తుషార్ డూడి ఆదేశాల మేరకు ఐటీకోర్ ఎస్సై షేక్.నాయుబ్‌రసూల్ ఆధ్వర్యంలో టెక్నికల్ బృందం ఇచ్చిన సమాచారం మేరకు టుటౌన్ ఇన్‌స్పెక్టర్ బి.నాగభూషణం నేతృత్వంలో ఒక బృందం ఢిల్లీకి వెళ్లి, అక్కడ జతిన్‌ను పట్టుకొని ఫోన్ సీజ్ చేసి కేసుతో సంబంధం ఉన్న మిగిలిన అనుమానితుల వివరాలు సేకరించి వారిని అరెస్టు చేసినట్లు తెలిపారు. వారి వద్ద నుంచి లక్షా 90 వేల రూపాయల నగదు, మూడు సెల్‌ఫోన్‌లు, 15 సిమ్ కార్డులు, నాలుగు బ్యాంక్ పాస్‌బుక్‌లు, రెండు ఏటీఎం కార్డులు సీజ్ చేశామని చెప్పారు. ఇప్పటి వరకు 96 సిమ్ కార్డులు ఉపయోగించి 132 మందిని మోసగించారన్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్‌లో రూ. 66 లక్షల వరకు మోసగించినట్లు వివరించారు. 20 రాష్ట్రాలలో, 4 కేంద్రపాలిత ప్రాంతాలలో వీరిపై మొత్తం 213 కేసులు నమోదైనట్లు తెలిసిందనీ, సుమారు రూ. 4 కోట్లు మోసం చేశారని తెలిపారు. వీరిని చాకచక్యంగా పట్టుకున్న చీరాల టుటౌన్ సీఐ బి.నాగభూషణం ఆర్ఐటీ శ్రీకాంత్, ఐటీ కోర్ టెక్నికల్ టీమ్ ఎస్సై షేక్.నాయుబ్ రసూల్, ఎస్సై నాగశ్రీను, టెక్నికల్ టీమ్, కానిస్టేబుళ్ల బి.సురేష్, కె.రాము, ఐ.కీర్తి, డి.తబితలను ఎస్పీ అభినందించారు.చీరాల డీఎస్పీ మోయిన్, సీఐ బి.నాగభూషణం, ఆర్ఐ టి.శ్రీకాంత్, ఎస్సై షేక్.నాయుబ్ రసూల్ పాల్గొన్నారు.

జవాన్ వెంకటేశ్‌కు ఘన నివాళి



పిట్టలవానిపాలెం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): బాపట్ల జిల్లా, పిట్టలవానిపాలెం గ్రామ పంచాయతీలోని గౌడపాలెం గ్రామానికి చెందిన ఆర్మీజవాన్ పరిశా మోహన వెంకటేశ్ అంత్యక్రియలు శుక్రవారం నిర్వహించారు. తొలుత వెంకటేశ్ గృహానికి బాపట్ల ఆర్డీవో పి.గ్లోరియా, పిట్టలవానిపాలెం తహసీల్దార్ డి.వెంకటేశ్వరరావు, కెప్టెన్ సత్యప్రసాద్, ఏడీ డైరెక్టర్, జిల్లా సైనిక సంక్షేమ అధికారిణి గుణశీల, పర్యవేక్షణాధికారి డి.ఆనందరావు, బాపట్ల రూరల్ సర్కిల్ సీఐ హరికృష్ణ, చందోలు ఎస్సై ఆర్.స్వామి శ్రీనివాస్ వేర్వేరుగా వెంకటేశ్ భౌతిక కాయాన్ని సందర్శించి ఘనంగా నివాళులర్పించారు. భౌతిక కాయాన్ని స్వగ్రామం నుంచి శ్మశాన వాటిక వరకు అధికారిక లాంఛనాలతో తీసుకెళ్లారు. అనంతరం అంత్యక్రియలు నిర్వహించారు. ఆర్మీ సైనికులు మూడు రౌండ్‌లు గాలిలోకి కాల్పులు జరిపారు. గ్రామ సర్పంచి బొలగాని అరుణకుమారి, గ్రామ పంచాయతీ కార్యదర్శి ప్రసాదరావు, ఆర్ఐ కె.శ్రీనివాసరావు, మాజీ ఎంపీపీ బొలగాని వెంకటసులోచన, టీడీపీ నాయకులు వెంకటపతిరాజు పాల్గొన్నారు.

పట్టభద్రులను మోసగిస్తున్న పీడీఎఫ్

- టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్



నరసరావుపేట టౌన్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): పీడీఎఫ్ ముసుగులో వైసీపీకి తొత్తుగా మారి పట్టభద్రులను మోసగిస్తున్న కేఎస్ లక్ష్మణరావును విద్యావంతులు ఓడించాలని టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. బాత్రూమ్‌లు, మద్యం దుకాణాల వద్ద కాపాలా పెట్టి ఉపాధ్యాయుల ఆత్మగౌరవాన్ని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, వైసీపీ పాలకులు దెబ్బతీస్తుంటే అప్పుడు కేఎస్ లక్ష్మణరావు ఎందుకు ప్రశ్నించలేదో చెప్పాలన్నారు. వైసీపీ పాలనలో నిరుద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లే విధంగా కేఎస్ లక్ష్మణరావు శాసనమండలిలో ఏనాడైనా చర్చించారా అని ప్రశ్నించారు. విద్యావంతులు వీటిపై ఆలోచించాలని సూచించారు. వైసీపీ పాలనలో రాష్ట్రం అస్తవ్యస్తమైందనీ, కూటమి అధికారం చేపట్టిన తొమ్మిది నెలల్లోనే రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో పరుగులు పెట్టిస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కు ధన్యవాదాలు అన్నారు. అభివృద్ధి జరగాలన్నా, సంక్షేమ ఫలాలు సామాన్య ప్రజానీకానికి అందాలన్నా కూటమి ప్రభుత్వంతోనే సాధ్యం అన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో మొదటి ప్రాధాన్యత ఓటును కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాదుకు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. శాసన మండలిలో ఆలపాటి అడుగు పెడితే విద్యావంతుల, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారని అన్నారు.

మాస్టర్స్ వెటరన్ బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభం



జ్యోతి ప్రజ్వలనతో పోటీలు ప్రారంభిస్తున్న డాక్టర్ ఎంఎస్ చౌదరి

తాడేపల్లి (ప్రాతూరు కట్ట), ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ బ్యాడ్మింటన్ అసోసియేషన్, స్పాన్సర్ విజయవాడ క్లబ్ ఆధ్వర్యంలో ఏపీ స్టేట్ మాస్టర్స్ వెటరన్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ పోటీలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. విజయవాడ క్లబ్ అధ్యక్షుడు ఎంఎస్ చౌదరి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటువంటి పోటీలు మానసిక ఉల్లాసానికి, దేహదారుఢ్యానికి ఉపయోగపడతాయని అన్నారు. ఆంధ్రప్రదేశ్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ అంకమ్మ చౌదరి, విజయవాడ క్లబ్ జాయింట్ సెక్రటరీ గుత్తికొండ వెంకట శైలేష్ కుమార్, క్లబ్ సభ్యులు, ప్రతినిధులు నిర్వాహకులు, క్రీడాకారులు పాల్గొన్నారు. తొలుత క్వాలిఫైయింగ్ మ్యాచ్‌లు నిర్వహించారు.

కుంభమేళాకు 60 వేల మంది యాత్రికులు

గుంటూరు, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): కుంభమేళాకు ప్రత్యేక రైళ్ల ద్వారా గుంటూరు, విజయవాడల నుంచి 60 వేల మంది యాత్రికులు ఇప్పటి వరకు ప్రయాణించారని దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో ఏ.శ్రీధర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ రెండు రైల్వేస్టేషన్ల మీదుగా ఇప్పటి వరకు 115 రైళ్లను రైల్వే శాఖ నడిపిందన్నారు. ఈ రైళ్లన్నీ 100 శాతం పైగా ఆక్యుపెన్సీతో ప్రయాణించాయని పేర్కొన్నారు. ఈ రైళ్లు ప్రయాగ్‌రాజ్ చియోకి, గయా, అజాంగడ్, బనారస్, దానాపూర్‌లకు ప్రయాణం చేశాయని చెప్పారు. విజయవాడ, గుంటూరు, మచిలీపట్నం, నరసపూర్ రైల్వేస్టేషన్ల నుంచి ఈ రైళ్లను ప్రయాణికుల సౌకర్యార్థం నడిపామన్నారు. ఆయా రైల్వేస్టేషన్లలో ప్రయాణికులు సులభతరంగా రైళ్లలో బోర్డింగ్, డీబోర్డింగ్ అయ్యేందుకు రోప్ పార్టీలను ఏర్పాటు చేశామన్నారు. అదనపు షెల్టర్లు కూడా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కాగా ఈ నెల 23న చర్లపల్లి నుంచి దానాపూర్‌కు ఒక ప్రత్యేక రైలు, దానాపూర్ నుంచి చర్లపల్లికి మరో రైలు ప్రయాణికుల సౌకర్యార్థం నడపనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రయాణికులు వినియోగించుకోవాలని సీపీఆర్‌వో విజ్ఞప్తి చేశారు.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

విజయపురిసౌత్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం శుక్రవారం నాటికి 534.60 అడుగులు ఉంది. ఇది 177.26 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 8452 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 7601, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 15,477, ఎస్ఎల్‌బీసీ ద్వారా 2000, ఎల్ఎల్‌సీ ద్వారా 280, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 33,810 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.50
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	87, 99,108
చికెన్ విత్ స్కిన్	172.00
చికెన్ స్కిన్ లెస్	182.00

రోస్టర్ విధానంలో తప్పులను సవరించాలి

● కలెక్టరేట్ ఎదుట గ్రూపు 2 అభ్యర్థుల నిరసన

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): రోస్టర్ విధానంలో ఏర్పడిన తప్పులను సవరించిన తరువాతే గ్రూపు-2 ప్రధాన పరీక్ష నిర్వహించాలని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) జిల్లా కార్యదర్శి షేక్ వలి డిమాండ్ చేశారు. పరీక్ష వాయిదా వేయాలని కోరుతూ శుక్రవారం కలెక్టరేట్ ఎదుట అభ్యర్థులు చేపట్టిన నిరసనల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. రోస్టర్ లోపాల కారణంగా అనేక మంది అభ్యర్థులకు అన్యాయం జరుగుతుందని, లోపాలను పరిశీలించేందుకు ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నిరుద్యోగుల ఐక్యవేదిక రాష్ట్ర కన్వీనర్ కొల్లికొండ వెంకట సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ రోస్టర్‌పై స్పష్టత లేకుండా పరీక్ష నిర్వహించడం సబబు కాదన్నారు. తప్పులను సరిదిద్దకపోతే ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. నిరసనల్లో అభ్యర్థులు, నిరుద్యోగ సంఘ నాయకులు పాల్గొన్నారు.

దర్గా ఉరుసు ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే మాధవి

గుంటూరు, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): ఆర్.అగ్రహారం మొహిద్దీన్‌పాలెంలోని 'హజ్రత్ సయ్యద్ షాహ మొహిద్ది న్ బాద్ షా ఔలియా రహ్మ' దర్గా ఉరుసు ఉత్సవాల్లో ఎమ్మెల్యే గళ్లా మాధవి పాల్గొన్నారు. బాబాకు ఎమ్మెల్యే చాదర్ సమర్పించారు.

ఆత్మ రక్షణకు కరాటే అవసరం

ఆత్మరక్షణకు కరాటే ఎంతో అవసరమని, ప్రస్తుత పరిస్థితుల్లో ఆడపిల్లలకు రక్షణ ఉండాలంటే కరాటే వంటి రక్షక విద్యలు నేర్చుకోవాలని ఎమ్మెల్యే గళ్లా మాధవి అన్నారు. ఫిబ్రవరి 16, 17 తేదీల్లో అద్దంకిలో జరిగిన జాతీయ స్థాయి కరాటే పోటీలలో ప్రతిభ కనపరిచిన చిన్నారులను ఆమె శుక్రవారం అభినందించారు. క్రీడాకారులకు సర్టిఫికెట్, ట్రోఫీలు అందజేసి, శాలువాలతో విద్యార్థులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో బాలకృష్ణ, అబ్దుల్ రహీం, చంద్రగిరి బాబు, మొవ్వా వేణు బాబు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ ఆర్టీసీ డీఎం

గుంటూరు, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): డిపో పరిధిలోని సమస్యల పరిష్కారంలో భాగంగా శనివారం ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు డయల్ యువర్ డిపో మేనేజర్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు గుంటూరు-1 డిపో మేనేజర్ ఎంవీఎస్ రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. డిపో పరిధిలోని తుళ్ళూరు, అమరావతి, క్రోసూరు, 75-తాళ్ళూరు, పర్చూరు రూట్‌లలో ప్రయాణించే ఉద్యోగులు, విద్యార్థులు బస్సుల వేళల్లో మార్పులు, అదనపు బస్‌ల ట్రిప్పుల కోసం, సిబ్బంది ప్రవర్తనపై తమ అభిప్రాయాలు, సలహాల కోసం 9959225420కు సంప్రదించాలని కోరారు.

నారాకోడూరు వద్ద ఆర్టీసీ, రవాణాశాఖ అధికారుల తనిఖీలు

గుంటూరు, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): నారాకోడూరు సెంటర్‌లో ఆర్టీసీ గుంటూరు-2 డిపో మేనేజర్ షేక్ అబ్దుల్ సలాం, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు టి.రాఘవరావు, బి.మధుసూదనరావు, జి.అమృతరాణి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. సరైన పత్రాలు లేని పలు వాహనాలను నిలిపివేసి జరిమానాలు విధించారు. సరైన పత్రాలు లేని వాహనాలు ఆపి రూ.లక్షా 20 వేల జరిమానా విధించినట్లు తెలిపారు. తనిఖీల్లో ఆర్టీసీ అసిస్టెంట్ మేనేజర్ సాంబశివ, సెక్యూరిటీ సిబ్బంది ఉన్నారు.

ప్రభుత్వాస్పత్రిలో 'మీ కోసం మేము'

గుంటూరు మెడికల్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): గుంటూరు ప్రభుత్వ సమగ్రాస్పత్రిలో రోగుల, వారి సహాయకుల సంక్షేమ కోసం కొత్తగా 'మీ కోసం మేము' అనే కార్యక్రమాన్ని సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వి శుక్రవారం ప్రారంభించారు. ఆసుపత్రి అత్యవసర వైద్య విభాగం క్యాజువాల్టీ ఆవరణలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఇకపై ప్రతి శుక్రవారం మధ్యాహ్నం 12 నుంచి ఒంటి గంట వరకు మీ కోసం మేము కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. జీజీహెచ్‌లో వైద్యం కోసం వచ్చే రోగులతో సంభాషించి వారి సందేహాలు, సమస్యలు తీర్చేందుకు వైద్యులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారని వివరించారు.

కార్మిక సంక్షేమ బోర్డును పునరుద్ధరించండి : పుప్పాల

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): జగన్ ప్రభుత్వం నిర్వీర్యం చేసిన కార్మిక సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని భవన నిర్మాణ కార్మిక సంఘం (ఏఐటీ యూసీ) రాష్ట్ర అధ్యక్షుడు పుప్పాల సత్యనారాయణ కూటమి ప్రభుత్వాన్ని కోరారు. గుంటూరులో సీపీఐ కార్యాలయంలో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ఏర్పడి ఎనిమిది నెలలు గడిచినా ఇంత వరకు సంక్షేమ బోర్డు ప్రకటించకపోవడం బాధాకరమన్నారు. ఈనెల 24న జిల్లా కలెక్టర్ కార్యాలయాల వద్ద తలపెట్టిన ధర్నాను జయప్రదం చేయాలని పిలుపు నిచ్చారు. సమావేశంలో ఏఐటీయూసీ నాయకులు ఆకిటి అరుణ్‌కుమార్, మేడా హనుమంతరావు, రావుల అంజిబాబు, రామారావు, బొట్టు శ్రీనివాసరావు, చల్లా మరియదాసు పాల్గొన్నారు.

ఐసీఏఐ నూతన కార్యవర్గ ఎన్నిక

గుంటూరు (విద్య), ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): ది ఇనిస్టిట్యూట్ ఆఫ్ చార్టెడ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ) గుంటూరు బ్రాంచ్ కార్యవర్గ ఎన్నిక శుక్రవారం నిర్వహించారు. చైర్మన్‌గా చింతా రఘునందన్, వైస్ చైర్మన్‌గా రుద్రవరపు భరద్వాజ్, సెక్రటరీగా వనిమిరెడ్డి వెంకట నరేష్, ట్రెజరరీగా మృత్యుంజయరావు, సి.కా.సా చైర్మన్‌గా రాజశేఖర్, కమిటీ సభ్యులుగా సీఏ బాజీ షేక్, దేసు సంపత్ ఎన్నికయ్యారు. చైర్మన్ చింతా రఘునందన్ మాట్లాడుతూ నూతనంగా నిర్మిస్తున్న బిల్డింగ్ పూర్తి చేసి సీఏ సభ్యులకు, సీఏ విద్యార్థులకు మెరుగైన వసతులను కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ అధ్యక్షుడు ముప్పాళ్ల సుబ్బారావు పాల్గొన్నారు



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నసీర్



ఉపాధ్యాయుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవి

ఆలపాటి గెలుపుతో యువతకు ఉజ్వల భవిష్యత్తు

● తూర్పు ఎమ్మెల్యే నసీర్

గుంటూరు, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కృష్ణ, గుంటూరు జిల్లా పట్టభద్రుల ఎన్నికల్లో కూటమి అభ్యర్థిగా పోటీ చేస్తున్న మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్‌ను గెలిపిస్తే యువతకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అన్నారు. గుంటూరు తూర్పు నియోజకవర్గంలోని పలు ప్రైవేటు విద్యా సంస్థలు, వాసవి కాంప్లెక్స్ తదితర ప్రాంతాల్లో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నప్పుడు యువత, ఉద్యోగులకు సీఎం చంద్రబాబు ఎంత మేలు చేశారో గుర్తు చేసుకోవాలని, అదే జగన్ అధికారంలో ఉండగా ఉద్యోగాలు లేక నిరుద్యోగులు, వేధింపులతో ఉద్యోగులు ఎంత ఇబ్బందులకు గురయ్యారో విద్యావంతులు ఒక్కసారి ఆలోచించుకోవాలన్నారు. విద్యావేత్త, సీనియర్ నాయకుడు ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ గెలుపు ద్వారా గుంటూరు జిల్లా యువత సత్తాను చాటి చెప్పాలని సూచించారు. కార్యక్రమంలో స్కూల్ చైర్మన్ మరెడ్డి, గుంటూరు ఈస్ట్ అబ్జర్వర్ గంజాం రాఘవేంద్ర, కొనకళ్ళ సత్యం, డిప్యూటీ మేయర్ సజీల, పద్మావతి వంగర ఏడుకొండలు, రజాక్ పాల్గొన్నారు.

విద్యావేత్త ఆలపాటి రాజేంద్రప్రసాద్ గెలుపు తథ్యం

● ఎమ్మెల్యే గళ్లా మాధవి

గుంటూరు, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కృష్ణా-గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎన్డీయే కూటమి బలపరిచిన అభ్యర్థి, మాజీ మంత్రి, విద్యావేత్త ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ గెలుపు తథ్యమని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్లా మాధవి అన్నారు. నగరంలోని పలు ప్రైవేటు విద్యాసంస్థలకు చెందిన ఉపాధ్యాయులతో ఆమె సమావేశమై ఓట్లు అభ్యర్థించారు. ఆమె మాట్లాడుతూ రాష్ట్ర భవిష్యత్తు గురించి ఉపాధ్యాయు లు ఆలోచించాలని, అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడు యువతకు ఉద్యోగాల కల్పనపై దృష్టి పెట్టారని, ఒక వైపు సంక్షేమ పథకాలు అందిస్తూనే, రాష్ట్రాభివృద్ధికి కృషి చేస్తున్నారని చెప్పారు. అలాంటి ఎన్డీయే కూటమి ప్రభుత్వానికి విద్యావంతులందరూ అండగా నిలవాలని, ఆలపాటి రాజేంద్ర ప్రసాద్‌కు ఉపాధ్యాయులు, పట్టభద్రులు తమ తొలి ప్రాధాన్య ఓటును వేసి గెలిపించాలని ఎమ్మెల్యే మాధవి కోరారు.

ఆలపాటికి ప్రతి ఒక్కరూ మద్దతు ఇవ్వాలి

● ఏపీ టీడీసీ చైర్మన్ డాక్టర్ నూకసాని బాలాజీ

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు ప్రతి ఒక్కరూ మద్దతు ఇచ్చి, ఆయనకు విజయం చేకూర్చాలని ఏపీ పర్యాటక అభివృద్ధి సంస్థ (టీడీసీ) డాక్టర్ నూకసాని బాలాజీ అన్నారు. ఆలపాటి రాజేంద్ర ప్రసాదుకు మద్దతుగా శుక్రవారం తూర్పు నియోజకవర్గంలో విస్తృత ప్రచారం చేశారు. ఉపాధ్యాయులు, ప్రైవేటు టీచర్లు, ఇతర ఉద్యోగుల సమస్యలను త్వరలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో తూర్పు నియోజకవర్గ పరిశీలకులు రాఘవేంద్ర, అఖిల భారత ఓబీసీ సంఘం చైర్మన్ అంగిరేకుల వరప్రసాద్ యాదవ్, టీడీపీ నాయకులు జాగర్లమూడి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఆలపాటితోనే ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం

● జనసేన పార్టీ నేతల ప్రచారం

గుంటూరు, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సీ ఎన్నికల్లో ఎన్‌డీఏ కూటమి బలపరచిన అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఉపాధ్యాయులను జనసేన పార్టీ నాయకులు కోరారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని నగరంపాలెంలోని స్టాల్స్ గర్ల్స్ హైస్కూల్‌లో, సంపత్‌నగర్‌లోని వైష్ణవి స్కూల్‌లో శుక్రవారం ఉపాధ్యాయులను కలసిన జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోనబోయిన శ్రీనివాస్‌యాదవ్, ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావులు కూటమి అభ్యర్థి ఆలపాటిని గెలిపించాలని కోరారు. ఎన్డీయే కూట మి అభ్యర్థి రాజేంద్రప్రసాద్‌ను గెలిపించుకుంటే ఉపాధ్యాయులు ఎదుర్కొనే సమస్యల పరిష్కారానికి చక్కటి అవకాశం లభిస్తుందని బోనబోయిన తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మద్దిరాల ఇమ్మానుయేల్, జనసేన కార్పొరేటరు యర్రంశెట్టి పద్మావతి, పార్టీ నాయకులు చట్టాల త్రినాథ్, కటకంశెట్టి విజయలక్ష్మి, బాలకృష్ణ, తాడికొండ కిషోర్, జెట్టబాబు, కృష్ణ, దళవాయి కిషోర్, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పట్టభద్రులు ఆలపాటిని గెలిపించాలి : సతీష్‌శర్మ

గుంటూరు, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు, కృష్ణా జిల్లాల్లోని పట్టభద్రులంతా టీడీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు ప్రథమ ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని టీడీపీ నాయకుడు కోనూరు సతీష్‌శర్మ పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో రెడ్డిపాలెం మాజీ సర్పంచ్ తాళ్ళ సాంబశివరావు (బుజ్జి)తో కలిసి ఆయన ఇన్నర్‌రింగ్ రోడ్డు ప్రాంతంలో శుక్రవారం ప్రచారం నిర్వహించారు. పలువురు బ్రాహ్మణ వర్గీయులతో సమావేశమైన ఆయన మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధి కోసం విద్యావంతులైన వారు ఆలోచన చేసి కూటమి అభ్యర్థి ఆలపాటిని గెలిపించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఈ సందర్భంగా కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కె శ్రీనివాసరావు, సుబ్బారావు, వినాయకరావు తదితరులున్నారు.

మన హృదయానికి దగ్గరైనది మాతృభాష

● విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య



మాట్లాడుతున్న డాక్టర్ రత్తయ్య

గుంటూరు (విద్య) ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): మాతృభాష మన హృదయానికి బాగా దగ్గరైన భాష అని, మాతృభాషని ఎవరూ కూడా మరచిపోవద్దని విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య విద్యార్థులకు తెలిపారు. వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలో మాతృ భాషా దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. డాక్టర్ లావు రత్తయ్య మాట్లాడుతూ మాతృభాష విద్యా రంగంలో అనేక ప్రయోజనాలను అందిస్తుందన్నారు. పిల్లల అభ్యాసం, సృజనాత్మకత, నైపుణ్యాలు పెరిగేలా చేస్తుందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. పలు పోటీల్లో సత్తాచాటిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలను, మెమోంటోలను అందజేసారు.

హిందూ కళాశాల తెలుగు విభాగం ఆధ్వర్యంలో...

మాతృభాషాభివృద్ధితోనే మానవ మనుగడ సుసాధ్యమవుతుందని అధికార భాషా సంఘం సభ్యుడు డాక్టర్ కత్తి వెంకటేశ్వర్లు అన్నారు. స్థానిక హిందూ కళాశాల తెలుగు విభాగం ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాతృ భాషా దినోత్సవ సభ నిర్వహించారు. సభకు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పులిపాటి మల్లికార్జున ప్రసాద్ అధ్యక్షత వహించారు. సమావేశంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కేవీఎస్ దుర్గాప్రసాద్, తెలుగు విభాగాధిపతి డాక్టర్ యల్లాప్రగడ మల్లికార్జునరావు, ఆంగ్ల విభాగాధిపతి డాక్టర్ అందె బాలశౌరి, అధ్యాపకులు ఇ.సుదేర్శన్, ఆలూరి నటరాజ కుమారి, తపతీకిరణ్ ప్రసంగించారు.

జేకేసీ కళాశాలలో...

గుంటూరు(విద్య),ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): స్థానిక జేకేసీ కళాశాలలో తెలుగు భాష దినోత్సవం సందర్భంగా శుక్రవారం గజల్‌పై కార్యశాల(వర్కుషాపు) నిర్వహించారు. భారతీయ భాష విభాగం, కళాశాల ఆంగ్ల భాష విభాగం సంయుక్త ఆధ్వర్యంలో రాజా వాసిరెడ్డి మల్లీశ్వరి ఆధ్వర్యంలో వర్కుషాపు నిర్వహించారు. గజల్ మూలాలను డాక్టర్ వై ప్రశాంతి వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ పి గోపిచంద్, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ కె సాంబశివరావు, కళాశాల కార్యదర్శి జాగర్లమూడి మురళీమోహన్ తదితరులు మాట్లాడుతూ పల్లె నుంచి ప్రపంచ రికార్డులు స్థాపించే స్థాయికి రాజావాసిరెడ్డి మల్లీశ్వరి అక్షర యజ్ఞం చేస్తూ ఎదిగారని ప్రశంసించారు. ఈ సందర్భంగా మల్లీశ్వరిని సత్కరించారు. కార్యక్రమంలో పీజీ కోర్సుల డైరెక్టర్ ఎస్ఆర్‌కె ప్రసాద్, పి నాగసుశీల తదితరులు పాల్గొన్నారు.

అంకిరెడ్డిపాలెం జడ్పీ స్కూల్లో...

మాతృభాష అన్ని భాషలకన్నా మధురమైనది హెచ్ఎం సరోజిని అన్నారు. అంకిరెడ్డిపాలెం జడ్పీ స్కూల్లో తెలుగు భాష దినోత్సవం నిర్వహించారు. తెలుగు ఉపాధ్యాయురాలు విజయకుమారి ఆధ్వర్యంలో గుణింతాల గుర్తుల పదాలు, తెలుగు పదాలతో, చార్ట్‌లతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు చంద్రమౌళి, ధర్మరాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

వేంకటేశ్వర దేవాలయంలో....

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వర దేవాలయంలో అన్నమయ్య కళావేదికపై విద్యావేత్త నూతలపాటి తిరుపతయ్య సౌజన్యంతో రాష్ట్ర సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ మహిళావిభాగం ఆధ్వర్యంలో శుక్రవారం అంతర్జాతీయ మాతృ భాషాదినోత్సవం ఘనంగా జరిగింది. తొలుత ఆలయ కమిటీ అధ్యక్షుడు మస్తానయ్య, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమం ప్రారంభించారు. కార్యక్రమంలో సాహితీవేత్తలు డాక్టర్ మైలవరపు లలితకుమారి, డాక్టర్ తాడేపల్లి వీరలక్ష్మి, డాక్టర్ వెలువోలు నాగరాజ్యలక్ష్మి డాక్టర్ వేమూరి సత్యవతి ప్రసంగించారు.

అన్నమయ్య పార్కులో

గుంటూరు, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక బృందావన్ గార్డెన్స్‌లోని అన్నమయ్య పార్కులోనున్న తెలుగు తల్లి విగ్రహానికి శుక్రవారం తెలుగు భాషాభిమానులు పూలమాల వేసి తమ అభిమానాన్ని చాటుకున్నారు. డాక్టర్ పట్టాభి కళాపీఠం అధ్యక్షులు తూములూరి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ప్రతిఒక్కరు వారి మాతృభాషా పరిరక్షణకు నడుంబిగించాలని కోరారు. అన్నమయ్య గ్రంథాలయ పాలకులు లంకా సూర్యనారాయణ, నవ్యాంధ్ర రచయితల సంఘం బాధ్యులు బండికల్లు జమదగ్ని, సయ్యద్ జానీబాషా, వి.రామారావు, గోపాలకృష్ణ తదితరులున్నారు.

అన్నదాన సమాజంలో..

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): జాతికి జీవనాడి అయిన తెలుగు పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని విశ్రాంత తెలుగు అధ్యాపకులు, ప్రముఖ రంగస్థల, సినీ, టీవీ నటుడు తుర్లపాటి రాధాకృష్ణమూర్తి అన్నారు. స్థానిక అమరావతి రోడ్డులోని అన్నదాన సమాజంలో శుక్రవారం అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మన మాతృభాష తెలుగు అత్యంత మధురమైనది, ప్రాచీనమైనదన్నారు. కార్యక్రమంలో ప్రముఖ కళాకారులు పివి రమణ, కన్నయ్య, బీపీఎల్ నరసింహారావు, రమణిమూర్తి, మహేష్, ఘనశ్యామి, ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కొణతం నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విధుల నుంచి సీఐ బత్తుల శ్రీనివాసరావు తొలగింపు



శ్రీనివాసరావు (ఫైల్)

గుంటూరు, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : సీఐ బత్తుల శ్రీనివాసరావును ఉద్యోగం నుంచి తొలగించారు. ఈ మేరకు శుక్రవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రొంపిచర్ల మండలం సంతగుడిపాడుకు చెందిన రామారావు అనే వ్యక్తి 2021లో నగరంపాలెం స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై నగరంపాలెం స్టేషన్‌లో జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. అనంతరం కేసును రొంపిచర్లకు బదిలీ చేశారు. ప్రస్తుతం ఆ కేసు విచారణ పెండింగ్‌లో ఉంది. ఆర్థిక లావాదేవీల విషయంలో రూ.35 లక్షలు ఇవ్వాల్సి ఉండగా ఇవ్వకుండా మోసం చేశారని రామారావు ఫిర్యాదు చేశారు. విశాఖపట్నంలో విశ్రాంత ఆర్మీ అధికారిని రూ.35 లక్షలు మేర మోసం చేసినట్లు ఆయన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆయా కేసుల్లో గతంలో ఆయన సస్పెండ్ అయ్యారు. ఇతనిపై నగరంపాలెంలో మూడు, అరండల్‌పేట్‌లో ఒకటి, విశాఖపట్నం, తెనాలిలో పలు చీటింగ్ కేసులున్నాయి. గురజాల మాజీ ఎమ్మెల్యే మల్లికార్జునరావు కోడలు బస్సులో వెళ్తుండగా ఆమె బంగారం చోరీ అయింది. ఆ కేసు దర్యాప్తులో కూడా చేతివాటం చూపినట్లు అప్పట్లో వార్తలొచ్చాయి. కొంత కాలం రాజుపాలెంలో ఐస్‌క్రీం వ్యాపారం చేసి అక్కడ కూడా ఒకరిని మోసగించినట్లు ఆరోపణలు వచ్చాయి. ఈయన స్వస్థలం ప్రకాశం జిల్లా పోతవరం గ్రామం. గుంటూరు విద్యానగర్‌లో స్థిరపడ్డారు. తొలుత నకరికల్లు, పెదకూరపాడు, ఈపూరు, పిడుగురాళ్ల, నరసరావుపేటలో ఎస్సైగా విధులు నిర్వర్తించారు. తర్వాత పదోన్నతిపై నరసరావుపేట, తెనాలి, గుంటూరులో సీఐగా చేశారు. ప్రస్తుతం ఆయన సీఐడీలో ఉన్నారు.

ఎస్పీ కార్యాలయంలో సీఐ ఫిర్యాదు

వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆ పార్టీ కార్యకర్త ఇచ్చిన తప్పుడు ఫిర్యాదుపై నాటి ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి నేతృత్వంలో తనపై అనేక తప్పుడు కేసులు బనాయించి వేధింపులకు గురి చేశారని ఉద్యోగం నుంచి తొలగించిన సీఐ బత్తుల శ్రీనివాసరావు ఆరోపించారు. ఈ మేరకు శుక్రవారం ఆయన జిల్లా ఎస్పీ కార్యాలయంలోనూ, అదేవిధంగా నగరంపాలెం పోలీస్ స్టేషన్లోనూ ఎస్సీ ,ఎస్టీ అట్రాసిటీ సెక్షన్ల కింద ఫిర్యాదు చేశారు.



బాధితులకు సెల్‌ఫోన్‌లు అందిస్తున్న అదనపు ఎస్పీ రమణమూర్తి

చోరీ చేసిన సెల్‌ఫోన్‌లు రికవరీ

● బాధితులకు అందజేసిన అదనపు ఎస్పీ రమణమూర్తి

గుంటూరు, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : ఎస్పీ సతీష్ కుమార్ ఆదేశాల మేరకు బాధితులు పోగొట్టుకున్న, దొంగిలించబడిన సుమారు 46.60 లక్షల విలువైన 234 సెల్ ఫోన్లను పోలీసులు రికవరీ చేసారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయ కాన్ఫరెన్స్ హాలులో జిల్లా అదనపు ఎస్పీ(అడ్మిన్) రమణ మూర్తి బాధితులకు అందజేసారు. రమణమూర్తి మాట్లాడుతూ ఎవరైనా ప్రజలు తమ మొబైల్ పోగొట్టుకున్న లేదా దొంగిలించబడిన ఎడల వెంటనే పోలీస్ హెల్ప్‌లైన్ నంబర్ 8688831574 లేదా సీఈఐఆర్ వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండి, నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఆయన కోరారు. సెల్‌ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అందజేయడంలో కృషి చేసిన ఐటీ కోర్ సీఐ నిషార్ బాషా, హెడ్ కానిస్టేబుల్ కిషోర్, కానిస్టేబుల్ శ్రీధర్, కానిస్టేబుల్ ఇమాం సాహెబ్, గౌస్ బాషా, మానస తదితరులను, సీసీఎస్ హెడ్ కానిస్టేబుల్ రమేష్, కానిస్టేబుల్ కరీముల్లాలను అదనపు ఎస్పీ అభినందించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీతో పాటు సీఐ నరేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సర్వేలు సకాలంలో పూర్తయ్యేలా పర్యవేక్షించాలి

● కమిషనర్ పులి శ్రీనివాసులు

గుంటూరు కార్పొరేషన్, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): నగరంలో వార్డు, సచివాలయాల వారీగా ప్రభుత్వ ప్రాధాన్యత సర్వేలు సకాలంలో పూర్తి అయ్యేలా నోడల్ అధికారులు పర్యవేక్షణ చేయాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు స్పష్టం చేశారు. సర్వేల వేగవంతంపై నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో శుక్రవారం నోడల్ అధికారులతో ప్రత్యేక సమావేశం జరిగింది. కమిషనర్ మాట్లాడుతూ ఈ నెల 27న జరగనున్న కృష్ణా-గుంటూరు పట్టభద్రుల ఓటింగ్‌కి సంబంధించి ఓటు హక్కు వినియోగంపై అవగాహన కోసం శనివారం జరిగే స్వీప్ ర్యాలీలో, అనంతరం శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో జరిగే సమావేశంలో సచివాలయ కార్యదర్శులందరూ పాల్గొనేలా నోడల్ అధికారులు బాధ్యత తీసుకోవాలన్నారు. సమావేశంలో అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, డిప్యూటీ కమిషనర్లు డి.శ్రీనివాసరావు, వి.శ్రీనివాసరావు, సీహెచ్ శ్రీనివాస్, టి.వెంకట కృష్ణయ్య, నోడల్ అధికారులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్ పులి శ్రీనివాసులు

సెల్లార్లను పార్కింగ్ కోసమే వినియోగించాలి

నగరపాలక సంస్థ పరిధిలోని హాస్పిటల్స్, కమర్షియల్ భవనాలు సెల్లార్‌లను పార్కింగ్ కోసమే వినియోగించాలని, ఇతర అవసరాలకు వినియోగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు స్పష్టం చేశారు. శుక్రవారం కమిషనర్ చాంబర్‌లో సెల్లార్ల వినియోగం, ప్రధాన రహదారుల్లో ట్రాఫిక్ నియంత్రణ అంశాలపై పట్టణ ప్రణాళిక అధికారులు, ట్రాఫిక్ అధికారులు, ఐఎంఏ ప్రతినిధులతో సంయుక్త సమావేశం జరిగింది. కమిషనర్ మాట్లాడుతూ, రోడ్లపై ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి అధికారులు ట్రాఫిక్ పోలీసులతో కో ఆర్డినేట్ చేసుకొని సెల్లార్లను ఖాళీ చేయించి, సదరు ప్రాంతాలను పార్కింగ్ కొరకు వినియోగించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆర్టీసీ బస్టాండ్ వద్ద ట్రాఫిక్‌నకు అంతరాయం కలిగేలా బస్సులను రోడ్లపై పార్కింగ్ చేస్తున్నారని దీనిపై ఆర్టీసీ ఆర్‌ఎంకు లేఖ రాయాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో డీసీపీ సూరజ్ కుమార్, ఏసీపీ రెహ్మాన్, తూర్పు ట్రాఫిక్ సీఐ అశోక్ కుమార్, ఐఎంఏ ప్రతినిధులు డాక్టర్ సుబ్బారాయుడు, డాక్టర్ సాయికృష్ణ పాల్గొన్నారు.

ఒకటి నుంచి ప్లాస్టిక్ వినియోగంపై నిషేధం

నగరపాలక సంస్థ పరిధిలో మార్చి 1 నుంచి సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగం, విక్రయంపై సంపూర్ణ నిషేధం అమలులో ఉంటుందని కమిషనర్ పులి శ్రీనివాసులు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కమిషనర్ మాట్లాడుతూ ప్రజారోగ్య, పర్యావరణ రక్షణ దృష్ట్యా ప్రతి ఒక్కరూ నిషేధానికి సహకరించాలని కోరారు. నిషేధ నిబంధనలు ఉల్లంఘన చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

సమస్యల పరిష్కారానికి ప్రతి నెల ప్రత్యేక గ్రీవెన్స్

నగరపాలక సంస్థలో పని చేసే కార్మికులు, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రతి నెల ప్రత్యేకంగా గ్రీవెన్స్ నిర్వహిస్తున్నామని, కార్మికులు, ఉద్యోగులు తమ సమస్యలపై నేరుగా తమకు అర్జీలు, ఫిర్యాదులు అందించవచ్చని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం నగరపాలక సంస్థ కార్మికులు, ఉద్యోగులు సమస్యల పరిష్కారం కొరకు వర్కర్స్ గ్రీవెన్స్‌ని కమిషనర్ చాంబర్‌లో నిర్వహించారు. కార్యక్రమంలో సీఎంఓహెచ్ డాక్టర్ అమృతం, విభాగ సూపరింటెండెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.

చెత్త సేకరణ నూరు శాతం జరిగేలా చూడాలి

గుంటూరు పరిధిలో ఇంటింటి చెత్త సేకరణ నూరు శాతం జరిగేలా ప్రజారోగ్య కార్యదర్శులు బాధ్యత తీసుకోవాలని, రోడ్ల మీద, కాల్వల్లో వ్యర్థాలు వేసే వారిని గుర్తించి అపరాధ రుసుం విధించాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. శుక్రవారం కమీషనర్ తమ రోజు వారీ పర్యటనలో భాగంగా సాయి నగర్, అంకిరెడ్డిపాలెం, ఏటీ అగ్రహారం, శ్రీరాంనగర్ తదితర ప్రాంతాల్లో అభివృద్ధి, పారిశుధ్య పనులను పరిశీలించి, అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. ఏటీ అగ్రహారం రిజర్వాయర్ పంప్ హౌస్‌ని పరిశీలించి, రానున్న వేసవి దృష్ట్యా అన్ని మోటార్లు వర్కింగ్‌లో ఉండేలా చర్యలు తీసుకోవాలని, పైప్ లైన్ లీకుల మరమ్మతులు పూర్తి చేయాలని ఆదేశించారు. పర్యటనలో డీఈఈలు శ్రీనివాస్, మధుసూదన్, ఇంజనీరింగ్, ప్రజారోగ్య అధికారులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఎక్స్‌గ్రేషియా చెక్కు అందజేత

ఇటీవల మరణించిన ప్రజారోగ్య విభాగ ఔట్ సోర్సింగ్ కార్మికులు బండి భవాని కుటుంబ సభ్యులకు ఎక్స్‌గ్రేషియా చెక్కును, ఈనెల 18న ప్రమాదంలో మరణించిన గొర్రెముచ్చు కొండమ్మ కుటుంబ సభ్యులకు మట్టి ఖర్చుల చెక్కులను శుక్రవారం కమిషనర్ చాంబర్‌లో కమిషనర్ అందజేశారు.

ఉద్యోగ నియామకాలు చేపట్టాలి

● జీ టీ రోడ్డులో ప్రభుత్వ బ్యాంకు ఉద్యోగుల నిరసన



నగరంపాలెం, యూనియన్ బ్యాంకు కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న ప్రభుత్వ బ్యాంకు ఉద్యోగులు

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): బ్యాంకులలో ఖాళీ ఉన్న ఉద్యోగులను తక్షణమే భర్తీ చేయాలని బ్యాంకు ఉద్యోగ సంఘాల ఐక్య వేదిక (యూ ఎఫ్‌బీయూ) కన్వీనర్ సయ్యద్ బాషా డిమాండ్ చేశారు. సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం నగరంపాలెం, జీటీ రోడ్డులోని యూనియన్ బ్యాంకు కార్యాలయం ఎదుట ప్రభుత్వ బ్యాంకు ఉద్యోగులు నిరసన తెలిపారు. ఎస్‌బీఐ ఆఫీసర్స్ అసోసియేషన్ చీఫ్ రీజినల్ సెక్రటరీ జయకుమార్, యూబీఐ నాయకుడు రాంబాబు మాట్లాడుతూ బ్యాంకు ఉద్యోగులపై జరుగుతున్న భౌతిక దాడులు బాధాకరమన్నారు. ఎస్‌బీఐ యూనియన్ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి కోటిరెడ్డి మాట్లాడుతూ ఐదు రోజుల పని విధానం, పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమస్యలను పరిష్కారానికై మార్చి 24, 25 తేదిల్లో తలపెడుతున్న సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు రవిచంద్రారెడ్డి, మురళీ సాంబశివరావు ,రామకృష్ణ వేణు, పావని, షరీఫ్, పృథ్వీ, విజయ క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

యువత అంకుర పరిశ్రమలు స్థాపించాలి

గుంటూరు(విద్య), ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): సమస్యలు పరిష్కరించడంతోపాటు, వ్యాపార దృక్పథంతో యువత అంకుర పరిశ్రమలను స్థాపించాలని ఏపీ సీఐఐ చైర్మన్ జెఎస్‌ఆర్‌కె ప్రసాద్ అన్నారు. చౌడవరంలోని ఆర్వీఆర్‌అండ్ జేసీ ఇంజనీరింగ్ కళాశాలలో నాలుగురోజులుగా జరుగుతున్న ఏఐసీటీఈ, ఐడీఈ బూట్ క్యాంపు ముగింపు సందర్భంగా శుక్రవారం ఏర్పాటు చేసిన సదస్సులో ఆయన మాట్లాడారు. శిబిరంలో వివిధ రాష్ట్రాల నుంచి ఇన్నోవేషన్ స్టార్టప్‌లు రావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యక్ష,కార్యదర్శులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, రాయపాటి గోపాలకృష్ణ, ప్రిన్సిపల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ముఠా కార్మికుల కూలీ రేట్ల జీవోను విడుదల చేయాలి

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): సివిల్ సప్లయిస్ ముఠా కార్మికుల కూలీ రేట్ల జీవోని వెంటనే విడుదల చేయాలని ఏపీ స్టేట్ సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ హమాలీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి రావుల అంజిబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక పాతగుంటూరు, సివిల్ సప్లయిస్ గోడౌన్ల వద్ద ఎంఎల్ఎస్ పాయింట్ల డీటీలు లింగయ్య, వెంకటకృష్ణలకు వినతి పత్రం అందజేశారు. అనంతరం రావుల అంజిబాబు మాట్లాడుతూ ప్రతి రెండేళ్లకు ఒకసారి ముఠా కార్మికులకు కూలీ రేట్ల పెంపుదల అగ్రిమెంటు జరుగుతున్న నేపథ్యంలో, ప్రభుత్వంతో చర్చలు నిర్వహించామని అన్నారు. నేటి వరకు కూలీరేట్ల జీవో విడుదల చేయలేదని అన్నారు. కార్యక్రమంలో కోట్ల మరియదాసు, డేవిడ్, సురేష్, బుజ్జి, కిరణ్, కాంతారావు తదితరులు ఉన్నారు.

ఖరీఫ్ నాటికి... కడగండ్లు తీరేనా?

● మరమ్మతుల కోసం కృష్ణాడెల్టా కాల్వల ఎదురుచూపు

● ప్రత్యేక నిధుల మంజూరు చెయ్యాల్సిందే

ఏ కాల్వ కట్ట చూసినా కడ'గండ్ల'మయమే. కాల్వ అంచుల వెంటున్న గోడలు, షట్టర్‌లయితే సరేసరి. తుప్పుపట్టి రంధ్రాలు పడిపోయి, గోడలు పగుళ్లిచ్చి కూలిపోయిన దయనీయ పరిస్థితులే పశ్చిమ డెల్టాలో ఉన్నాయి. కట్టలకు గండ్లు పడకుండా ఉండాలన్నా, తూముల నుంచి నీరు లీకవకుండా షట్టర్‌ల స్థానంలో అడ్డు వెయ్యాలన్నా, అన్నిటికీ ఇసుక మూటలే దిక్కయ్యాయి. కొన్నిచోట్లయితే అవికూడా నిలవటానికి ఆధారం లేక కాల్వలోకి జారిపోయి నీటి ప్రవాహానికి అడ్డుపడిపోతున్న పరిస్థితి. కృష్ణా పశ్చిమ డెల్టాలో ఎటు చూసినా ఇవే కష్టాలు. దీనికి కారణం... గత ప్రభుత్వ కాలంలో ఐదేళ్లు కాల్వల మరమ్మతులకు విదిలింపుల మినహా, ప్రత్యేకంగా నిధులిచ్చిన పరిస్థితిలేదు. ఇచ్చిన ఆ కొద్దిపాటి నిధులుకూడా సీజన్ దగ్గరకొచ్చాక కాల్వలకు నీరొదిలే ముందు విడుదల చేశామనిపించి తూటుకాడ వంటివి తొలగించామని వాటినీ ఆ పార్టీ నేతలే జేబులో వేసేసుకున్న పరిస్థితి. కొన్నిచోట్ల రైతులే స్వచ్ఛందంగా కాల్వలో దిగి తూటుకాడ, గుర్రపుడెక్క వంటివి తొలగించుకుంటేకానీ సాగుకు నీరందని దారుణ పరిస్థితినే నిన్నటి వరకు అనుభవించారు.



ప్రకాశం బ్యారేజి నుంచి కృష్ణా పశ్చిమ డెల్టాకు నీరందించే ప్రధాన కాల్వ కూడా పూడికలతో నిండిపోయిన చిత్రం

తెనాలి, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): పశ్చిమ డెల్టా మొత్తం మూడు జిల్లాల్లో విస్తరించి ఉంటే, వాటిలో బాపట్ల, గుంటూరు జిల్లాల్లోనే అధిక విస్తీర్ణం సాగవుతోంది. ఈ డెల్టాలో మొత్తం 5.71 లక్షల ఎకరాల సాగు విస్తీర్ణం ఉంటే, దానిలో గుంటూరు జిల్లా కింద 1,84,190 ఎకరాలు, బాపట్ల జిల్లా పరిధిలో 3,79,997 ఎకరాలు సాగవుతున్నాయి. మిగిలిన 7,164 ఎకరాలు మాత్రం ప్రకాశం జిల్లా పరిధిలో కొంతమేర ఉంది. గుంటూరు జిల్లాలో కొంత విస్తీర్ణానికి నీరు అందినా, బాపట్ల జిల్లాలోని చివరి భూములు, ప్రకాశం జిల్లాలో పూర్తి విస్తీర్ణానికి చుక్కనీరు అందటం గగనమైపోయింది. ఏ కాల్వ చూసినా కడ'గండ్ల'తప్ప పూర్తి సామర్థ్యంతో నీరు వెళ్లే పరిస్థితి లేదు. అయితే కూటమి ప్రభుత్వం ఈ ఖరీఫ్ సీజన్ ప్రారంభంలో రావటంతో మరమ్మతులపై దృష్టిపెట్టలేని పరిస్థితి. అయితే ప్రభుత్వం వచ్చిన వెంటనే సాగునీటి సంఘాల ఎన్నికలు పూర్తిచేసింది. సంఘాలు వచ్చిన తర్వాతే ఏ కాల్వకింద అత్యవసర పనులు ఏమున్నాయనేది గుర్తించగలిగారు. అయితే ప్రస్తుతం పనులు గుర్తించటం ఎంత ముఖ్యమో! వాటికి అవసరమైన నిదులు మంజూరు చేయటం, పనులు సకాలంలో పూర్తిచేసేలా అనుమతులివ్వటం కూడా అంతే ముఖ్యం. గతంలోలాగా సీజన్‌కు ముందు చివరి నిమిషంలో కాకుండా ఏప్రిల్‌లో టెండర్ల ప్రక్రియ కూడా పూర్తయ్యేలా సత్వరం స్పందిస్తేనే 2025-26 ఖరీఫ్ సీజన్ సాగు నీటి కష్టాలు లేకుండా గట్టెక్కే పరిస్థితి.

నీరున్నా సాగు సాగలేదు...

పశ్చిమ డెల్టా పరిధిలో 5.71 లక్షల ఎకరాల సాగు విస్తీర్ణం ఉంటే, ఈ మొత్తం విస్తీర్ణంలో ఒక ఖరీఫ్ సీజన్‌లో సాగు పూర్తవ్వాలంటే కనీసం 70 టీఎంసీల నీరు అవసరం అవుతుంది. అయితే గడచిన నాలుగేళ్లలో నీరు సమృద్ధిగా ఉన్నా, వరి సాగుకు మాత్రం అందలేదు. దీనికి కారణం... కాల్వలు పూడిపోయి, కట్టలు కోతపడిపోయి ఉండటమే. ప్రకాశం బ్యారేజి దగ్గర నుంచి మెయిన్ కెనాల్‌కు ప్రతి రోజూ 7,500 నుంచి 9వేల క్యూసెక్కులకు పైగా నీటిని వదిలినా చేలకు మాత్రం ఆ నీరు చేరని పరిస్థితి. కాల్వల మొదటి భూముల్లోనే ఆ నీరంతా నిండిపోయి ముంపు ఏర్పడిన పరిస్థితులూ ఉన్నాయి. ప్రధానంగా కొమ్మమూరు, బ్యాంక్ కెనాల్ కాల్వల కింద సాగు విస్తీర్ణం భారీగా ఉంది. ఒక్క కొమ్మమూరు కాల్వ కిందే 1.5 లక్షల ఎకరాలు సాగవుతుంటే, బ్యాంక్ కెనాల్ కింద లక్ష ఎకరాలకుపైగా సాగులో ఉంది. అయితే వీటిపై గత డెల్టా కాల్వల ఆధునికీకరణ సమయంలోనూ పనులు జరగలేదు. దీంతో ఈ కాల్వలపై కష్టాలు మాత్రం ఏటా పెరుగుతూనే వస్తున్నాయి. కొమ్మమూరు కాల్వ కిందయితే కట్టలు గండ్లు పడటం, బాపట్ల, పొన్నూరు ప్రాంతాల్లో పొలాలు ముంపునకు గురవటం వంటి సమస్యలూ ఉన్నాయి. నీరులేక ఒక సమస్యయితే, నీరున్నా వీటి కింద కష్టాలు ప్రతికూలంగా ఎదురవుతుండటంతో ఏటా ఖరీఫ్ రైతు నష్టాలను చవిచూడాల్సిన పరిస్థితి.



పెదపూడి దగ్గర నిజాంపట్నం కాల్వకట్ట జారిపోయి కాల్వలో అడ్డుగా కనిపిస్తున్న చిత్రం

ప్రతిపాదనలు ఓకే.. సకాలంలో అనుమతులే కీలకం

గడచిన ఐదు ఖరీఫ్ సీజన్‌లలో పశ్చిమ డెల్టాలోని కాల్వలకు నీరు సమృద్ధిగా అందినా, పొలాలకు మాత్రం చేరలేదు. చివరి భూములకయితే పంట ఎండిన దారుణ పరిస్థితులుకూడా ఉన్నాయి. ఇంత దారుణంగా కాల్వలున్నా, నీరు చివరి భూములకు చేరకున్నా కనీసం మరమ్మతులు చేసిన దిక్కులేదు. గత ఐదేళ్లలో ప్రతి సంవత్సరం పదుల సంఖ్యలో పనులను గుర్తించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పెడితే, అవి ఆమోదం పొందటానికి, తర్వాత టెండర్‌లు పిలవటానికే పనుల కాలమంతా సరిపోయేది. తీరా పనులు మొదలుపెట్టే సమయానికి కాల్వలకు నీరు వదిలేయటంతో నీటిలోనే పనులు చేసినట్టు రాతరాసి ఆ నిధులను కాస్తా జేబుల్లో వేసేసుకునేవారు. అయితే ఈ సీజన్లో మాత్రం ఏకంగా 900కుపైగా పనులను గుర్తించారు. వీటి మరమ్మతులకు రూ. 40 నుంచి రూ. 50 కోట్ల వరకు నిధులు అవసరమవుతాయని ప్రతిపాదనలుకూడా ప్రభుత్వానికి పంపారు. ఇంత వరకు సకాలంలోనే ప్రతిపాదనల ప్రక్రియ పూర్తయింది. అయితే ఈ ఖరీఫ్ సీజన్ ముగిసినా, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో వరి కోతలు పూర్తయిపోయి, రబీ కింద మొక్కజొన్న, జొన్నకూడా చాలావరకు చివరి దశకు వచ్చింది. అయితే ప్రకాశం జిల్లాకు ఇంకా మొదటి పంటకే నీరు ఇవ్వాల్సిన అవసరం ఉంది. మార్చి నెలాఖరుకు అటు రబీ, ఇటు రెండవ పంటకింద మొక్కజొన్న వంటివి కూడా పూర్తయిపోతాయి. మళ్లీ ఖరీఫ్ సీజన్ జూలై నుంచి మొదలవుతుంది. అంటే ఇంకా మూడు నుంచి నాలుగు నెలల వరకు పనులు చేసుకునేందుకు గడువు ఉంటుంది.



కృష్ణా పశ్చిమ బ్యాంక్ కెనాల్ నుంచి బ్రాంచి కాల్వలకు నీరు వదిలేందుకు ఏర్పాటుచేసిన షట్టర్‌కు అడ్డుగా రాళ్లు, చెత్త పేరుకుపోయిన చిత్రం

అయితే ఇప్పటికే నీటిపారుదల శాఖ ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపింది కనుక వెంటనే వాటి అనుమతులు మంజూరు చేస్తే టెండర్ల ప్రక్రియ వంటివి ఏప్రిల్లోపే పూర్తి చేసుకునే అవకాశం ఉంటుంది. అప్పటి నుంచి జూలై వరకు పనులు చేసేందుకు అవకాశం ఉంటుంది కనుక కాంక్రీట్ పనుల వంటివాటినికూడా పక్కాగా పూర్తిచేసే అవకాశం ఉంటుంది. గతంలోలాగా తూటుకాడ తొలగించామని నిధులు జేబులో వేసుకునే పరిస్థితి ఉండదు. నీరు వదిలేలోపే పనులు పూర్తవుతాయి కనుక చెయ్యకుండానే చేశామని మాయచేసే అవకాశం కూడా ఉండదు. దీనికితోడు సాగునీటి సంఘాలు ఉండటంతో వాటి పర్యవేక్షణలో పనులు చేయటంవల్ల రైతులే స్వయంగా పనులు దగ్గరుండి చేయించుకోటానికి అవకాశం ఏర్పడుతుంది.



రేపల్లె దగ్గర ఇసుకపల్లి చానల్ కట్టలు జారిపోవటంతో వాటికి అడ్డుగా వేసిన ఇసుక మూటలు కూడా కాల్వలోకి జారిపోయి చెల్లాచెదురుగా నీటి ప్రవాహానికి అడ్డుపడుతున్న చిత్రం

గతంలో నిధుల మంజూరు విషయంలో ఒక తిరకాసు ఉండేది. ఓ.అండ్.ఎం(ఆపరేషన్ అండ్ మెయింటినెన్స్) కింద వసూలయిన నీటి తీరువా మొత్తాలు మంజూరుచేస్తే కాల్వలపై కష్టాలు ఉండేవి కాదు. అయితే ఈ ఐదేళ్లలో ఏటా నీటిపారుదల శాఖ ఎంత ప్రతిపాదనలు పంపినా ప్రభుత్వం మాత్రం రూ. 15కోట్ల నుంచి రూ. 20 కోట్లలోపే మంజూరుచేసి చేతులు దులుపుకునేది. వీటిని చివరి నిముషంలో ఇవ్వటంతో సగం నిధులుకూడా ఖర్చుచేసే పరిస్థితి ఉండేది కాదు. ఆ మొత్తం నాయకులు జేబుల్లోకే చేరేవి. అయితే ఇప్పుడున్న కాల్వల పరిస్థితుల దృష్ట్యా ఈ సీజన్‌కు నీటిపారుదల శాఖ పంపిన రూ. 40 కోట్ల ప్రతిపాదనల మొత్తాన్నీ ఎటువంటి కోత విధించకుండా ఆమోదించితేనే కాల్వలపై ఏళ్లతరబడి ఉన్న కష్టాలు గట్టెక్కేది. అవసరమైతే వీటికి మించిన నిధులు కూడా మంజూరు చెయ్యాల్సిన పరిస్థితి ఉంది. సాగునీటి సంఘాలు ఈమధ్యే రావటంతో పూర్తిస్థాయిలో పనులను గుర్తించలేకపోయారు. అందువల్ల అదనపు నిదులు మంజూరు చేయగలిగితేనే పూర్తి శాతం కాల్వలకు వదిలిన నీరు చివరి భూముల వరకు చేరే అవకాశం ఉంది.

సమన్వయంతో సాగండి

● పీవోలను మైక్రో అబ్జర్వర్లు సమన్వయం చేసుకోవాలి ● ఎమ్మెల్సీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి నాగలక్ష్మి



ఎన్నికల నిర్వహణపై జరిగిన సమీక్షలో పాల్గొన్న కలెక్టర్, అబ్జర్వర్, డీఆర్వో

గుంటూరు, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కృష్ణా - గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గ శాసనమండలి ఎన్నికలు సజావుగా, ప్రశాంతంగా జరిగేలా ప్రిసైడింగ్, పోలింగ్ అధికారులను సమన్వయం చేసుకోవాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి మైక్రో అబ్జర్వర్లను ఆదేశించారు. శుక్రవారం గుంటూరు కలెక్టరేట్‌లో మైక్రో అబ్జర్వర్లకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో పరిశీలకురాలు వీ కరుణ, కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి, జిల్లా రెవెన్యూ అధికారి ఖాజావలితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, పోలింగ్ ప్రక్రియను సమర్థవంతంగా, పారదర్శకంగా నిర్వహిస్తున్నట్లు ఓటర్లలో మరింతగా నమ్మకం పెంచేందుకే ఎన్నికల సంఘం ప్రతి పోలింగ్ కేంద్రంలోను పరిశీలకుల తరుపున మైక్రో అబ్జర్వర్లను నియమించటం జరిగిందన్నారు. మైక్రో అబ్జర్వర్లకు పోలింగ్ అధికారులు పోలింగ్ డే ముందు రోజు డిస్ట్రిబ్యూషన్ సెంటర్ల నుంచి పోలింగ్ మెటీరియల్‌ను తీసుకోవటం, పోలింగ్ కేంద్రంలో ఏర్పాట్లు, పోలింగ్ నిర్వహణ, తిరిగి మెటీరియల్ రిసెప్షన్ కేంద్రాల్లో అప్పగించే వరకు అన్ని ప్రక్రియల్లో పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండాలన్నారు. పోలింగ్ డేకి ముందు రోజు డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల నుంచి పోలింగ్ అధికారులు తీసుకున్న మెటీరియల్‌ను పూర్తి స్థాయిలో పరిశీలించాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో నిర్దేశిత మార్గదర్శకాల ప్రకారం ప్రిసైడింగ్ అధికారులు చేస్తున్న ఏర్పాట్లను పరిశీలించి అవసరమైన సహకారం అందించాలన్నారు. బ్యాలెట్ బాక్స్‌లను పోలింగ్ కేంద్రాల నుంచి పూర్తి రక్షణతో రిసెప్షన్ కేంద్రాలకు తరలించి, కౌంటర్లలో అప్పగించేలా పర్యవేక్షణ చేయాలన్నారు. మైక్రో అబ్జర్వర్లు పర్యవేక్షించాల్సిన అంశాలను పూర్తిస్థాయిలో పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా కలెక్టర్ వివరించారు. బ్యాలెట్ బాక్స్‌ను పోలింగ్‌కు సిద్ధం చేయడం, సీలు చేసే ప్రక్రియ పైన హ్యాండ్స్ ఆన్ శిక్షణను అందించారు.

గుడ్డుకాయ స్వాహా

పౌల్ట్రీ ఫార్మర్స్ అండ్ ట్రేడర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన చికెన్ మేళాకు పోటెత్తిన జనం



చికెన్ మేళాలో పట్టాభిపురంలోని స్వామి థియేటర్ గ్రౌండ్‌లో చికెన్ ఫ్రై తింటున్న ఎమ్మెల్యేలు కన్నా లక్ష్మీనారాయణ, నసీర్, భాష్యం రామకృష్ణ తదితరులు

గుంటూరు సిటీ, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): బర్డ్ ఫ్లూ భయంతో రెండు వారాలుగా ముక్కకి.. ముద్దకి దూరంగా ఉన్న వారంతా కరువు తీరా కోడి పలావ్ ఆరగించారు. బర్డ్ ఫ్లూ పై ప్రజల్లో ఉన్న అపోహలు తొలగించేందుకు గుంటూరు పట్టాభిపురం స్వామి థియేటర్ గ్రౌండ్స్‌లో శుక్రవారం రాత్రి గుంటూరు జిల్లా పౌల్ట్రీ ఫార్మర్స్ అండ్ ట్రేడర్స్ అసోసియేషన్ ఏర్పాటు చేసిన చికెన్, గుడ్డు ఆహార మేళాకు జనం పోటెత్తారు. ఈ కార్యక్రమానికి సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ, గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నజీర్ అహమ్మద్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు మాట్లాడుతూ ప్రజలందరూ ఉడికించిన చికెన్, గుడ్లను తినొచ్చని పిలుపు నిచ్చారు. ఉడికించిన వాటిని తినటం వల్ల ఎలాంటి అనారోగ్య సమస్యలు రావని అన్నారు. ప్రజలందరూ ఈ విషయాన్ని గమనించాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా ఉడికించిన చికెన్, గుడ్లను తినొచ్చని చెప్పిందన్నారు. డాక్టర్ రాయపాటి మమత, డాక్టర్ నిమ్మల శేషయ్య, డాక్టర్ చెరుకూరి పవన్‌కుమార్ మాట్లాడుతూ ఉడికించిన చికెన్, గుడ్లు తినడం వల్ల ఎలాంటి ప్రమాదం ఉండదని తెలిపారు. సోషల్ మీడియాలో వచ్చే అన్ని కథనాలను నమ్మాల్సిన పని లేదని చెప్పారు. మాంసం, గుడ్లు తినటం వల్ల పౌష్టికాహార లోపాలు ఉండవని చెప్పారు. లేనిపోని అపోహలు విడనాడాలని పిలుపునిచ్చారు. జిల్లా పశుసంవర్థక శాఖ అధికారి ఓ నరసింహారావు మాట్లాడుతూ జిల్లాలో బర్డ్ ఫ్లూ కేసులు లేవని చెప్పారు. ప్రజలు లేని పోని అపోహలు పెట్టుకోవద్దని సూచించారు. ప్రజల్లో ఉన్న అనుమానాలు తొలగించేందుకు ఈ ఫుడ్ మేళా ఏర్పాటు చేశామని చెప్పారు. భయం విడనాడాలని, సోషల్ మీడియా కూడా ఈ విషయంలో బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. గుంటూరు జిల్లా పౌల్ట్రీ ఫార్మర్స్ అసోసియేషన్ నాయకులు మాట్లాడుతూ సోషల్ మీడియాలో జరిగిన అసత్య ప్రచారం కారణంగా చికెన్, గుడ్లు వ్యాపారం దారుణంగా పడిపోయిందని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, భాష్యం విద్యాసంస్థల అధినేత రామకృష్ణ, స్టాండింగ్ కమిటీ మెంబర్ బాబు, పౌల్ట్రీ ట్రేడర్ అసోసియేషన్ నేతలు ఎం. కిషోర్ బాబు, సురేష్, నాగేశ్వరరావు, రేణుక, గిరి, అసోసియేషన్ మెంబర్లు పాల్గొన్నారు.



చికెన్ బిర్యానీ, కోడిగుడ్లు తింటున్న యువకులు

బ్యాంకులను బతికించండి

● గుంటూరులో ఉద్యోగుల నిరసన ప్రదర్శన

గుంటూరు సిటీ, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): బ్యాంకింగ్ రంగంపై ప్రతికూల ప్రభావం చూపుతున్న విధానాలకు కేంద్రం వెంటనే స్వస్తి పలికి బ్యాంకులను బతికించాలని యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ డిమాండ్ చేసింది. బ్యాంక్ యూనియన్స్ ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం గుంటూరులోని యూనియన్ బ్యాంకు ప్రధాన కార్యాలయం వద్ద నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంక్ యూనియన్స్ నేతలు మాట్లాడుతూ 5 రోజుల బ్యాంకింగ్ అమలు, పరిపూర్ణ సిబ్బంది నియామకం , శాంతియుత పని వాతావరణం , సంస్కృతి స్థాపన, అనాగరిక ప్రజల దాడుల నుండి బ్యాంకు ఉద్యోగుల రక్షణ , గ్రాట్యుటీ చట్ట సవరణ చేసి పరిమితిని రూ.25 లక్షలకు పెంపు, సిబ్బంది సంక్షేమ ప్రయోజనాలపై ఆదాయ పన్ను మినహాయింపు తదితర డిమాండ్లకు ప్రభుత్వం వెంటనే ఆమోదం తెలిపాలని అన్నారు. బ్యాంకింగ్ పరిశ్రమలో అన్యాయ కార్మిక విధానాల ను తాము వ్యతిరేకిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ గుంటూరు సర్కిల్ ప్రాంతీయ కార్యదర్శి కేఆర్ జయ కుమార్, డిప్యూటీ జనరల్ సెక్రటరీ కే కోటిరెడ్డి, యూనియన్ సలహాదారు కిషోర్ కుమార్, అధ్యక్షుడు రవి చంద్రారెడ్డి, కార్యదర్శి సయ్యద్ మొహమ్మద్ బాషా , రాష్ట్ర అధ్యక్షుడు ఎం సాంబశివరావు, ప్రాంతీయ కార్యదర్శి ఎం రాంబాబు, ఎ కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.



గుంటూరులోని యూనియన్ బ్యాంకు ప్రధాన కార్యాలయం వద్ద నిరసన ప్రదర్శన నిర్వహిస్తున్న ఉద్యోగులు

రేపటి నుంచి అమరేశ్వరుని బ్రహ్మోత్సవాలు



అమరేశ్వరస్వామి మూలవిరాట్

అమరావతి, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకుని ఈ నెల 27వ తేదీన ప్రసిద్ధ శైవ ఆరామంగా భక్తులచే పూజలందుకుంటున్న అమరావతిలోని బాలచాముండికా సమేత అమరేశ్వరస్వామి వారి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ఈ నెల 23వ తేదీ నుంచి మార్చి 4వ తేదీ వరకు జరుగనున్నాయి. ఉత్సవాలలో భాగంగా ఆదివారం ఉదయం ఎనిమిది గంటలకు స్వామివారిని పెండ్లి కుమారునిగా చేయడం, 24న రాత్రి 7 గంటలకు విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనం, రక్షాబంధనం, వాస్తుహోమం, పర్యగ్నికరణం, అంకురారోహణ, అగ్ని ప్రతిష్టాపన, ధ్వజారోహణ కార్యక్రమాలు ఆలయ వేదపండితుల మంత్రోశ్ఛరణలతో మంగళవాయిద్యాల నడుమ నిర్వహించనున్నారు. 25న మండప పూజ, నిత్యోపాసన, బలిహరణ, పులి వాహనసేవ, పల్లకీ గ్రామోత్సవం జరగనుంది. 26న ఉదయం 8 గంటలకు రుద్రహోమంతో పాటు రోజువారి పూజలు జరుగుతాయి. రాత్రి 9 గంటలకు స్వామి వారి మూల విరాట్‌కు మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేక సహిత లింగోద్భవ అభిషేకం జరుగుతుంది. అర్ధరాత్రి 1 గంటకు స్వామివారి ఎదురు కోల సేవా మహోత్సవం, తెల్లవారుజామున 3 గంటలకు స్వామివారి దివ్య కల్యాణ మహోత్సవం, 27 ఉదయం 9 గంటలకు చిలుక, నంది, మిద్దె రథ వాహనాలతో స్వామివార్ల గ్రామోత్సవం, సాయంత్రం 4 గంటలకు స్వామివార్ల దివ్యరథోత్సవం జరుగుతుంది. మార్చి 1న వసంతోత్సవం, పూర్ణాహుతి, ధ్వజారోహణతో ఉత్సవాలు ముగుస్తాయి. 4 వరకు స్వామివారికి ప్రత్యేక సేవలు ఉంటాయి.

ఉలిక్కి పడుతున్న మైనింగ్ దొంగలు!

● విచారణ ప్రారంభం కావడంతో అక్రమార్కులలో కలవరం

● వెలుగుచూస్తున్న అక్రమాలు

పొన్నూరుటౌన్ (చేబ్రోలు) ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): చేబ్రోలు మండలంలో లభించే ఎర్ర గ్రావెల్ కోట్ల రూపాయల వర్షం కురిపించడంతో వైసీపీ ప్రభుత్వ హయాంలో దళితుల భూములను చెరబట్టి మరీ అక్రమార్కులు చేసిన అక్రమ మైనింగ్ బాగోతాలు నేడు బయట పడుతున్నాయి. వీరనాయకుని పాలెం గ్రామంలో 1983లో ప్రభుత్వం 60 ఎకరాల అసైన్డ్ భూమిని దళిత రైతులకు జీవనోపాధి కోసం డీకే పట్టాల రూపంలో అందజేసింది. అయితే 2019-2024 మధ్య వైసీపీ ప్రభుత్వ హయాంలో ఈ అసైన్డ్ పంట భూములు కనుమరుగై క్వారీ గుంతలుగా దర్శనమిస్తున్నాయి. గత ఐదేళ్ల కాలంలో జరిగిన అక్రమ గ్రావెల్ తవ్వకాల గుట్టు నేడు విచారణతో బయట పడుతుంది. దళితుల అసైన్డ్ భూములు నామరూపాలు లేకుండా పోయాయని విచారణకు వచ్చిన అధికారులే అవాక్కు అవుతున్నారు. గతంలో ఈ భూములలో సపోట, జామ వంటి పండ్ల తోటలతో పాటు ఆకు కూరలు, కూరగాయలు సాగు అవుతుండేవి, ప్రస్తుతం ఈ భూములలో ఎటు చూసిన క్వారీ గుంతలే దర్శనమిస్తున్నాయి. ఎర్ర గ్రావెల్ లక్షలాది క్యూబిక్ మీటర్‌ల మట్టిని తవ్వి తరలించుకుపోయినట్లు గనుల శాఖ అధికారులు గుర్తించారు. ఈ ప్రాంతంలో పర్యావరణ, వాల్టా చట్టాలు అమలు చేయకుండా నిబంధనలు తుంగలో తొక్కి గ్రావెల్ తవ్వకాలు సాగించినట్లు గుర్తించారు.

● దళిత రైతులకు బెదిరింపులు

దళిత రైతులపై సాగించిన దౌర్జన్యకాండ నేడు వెలుగు చూస్తుంది. అసైన్డ్ భూములలో రాత్రికి రాత్రి పాగా వేసి మట్టి తరలించుకుపోయారు. గ్రావెల్ తవ్వకాలు విషయం తెలుసుకున్న పలువురు దళిత రైతులు వాటిని అడ్డుకునే ప్రయత్నం చేయగా సర్వత్రా బెదిరింపులు, దౌర్జన్యాలే వారికి ఎదురయ్యాయి. ఒక అడుగు ముందుకు వేసిన మైనింగ్ మాఫియా దళిత రైతుల భూములలో వారి అనుమతి లేకుండా మట్టి తవ్వకాలు సాగించడమే కాకుండా పోలీసులను పెట్టి అక్రమంగా నిర్బంధించిన సంఘటనలు ఉన్నాయి. పోలీసులు, రెవెన్యూయంత్రాంగం సైతం మైనింగ్ మాఫియాకే కొమ్ము కాయడంతో దళిత రైతులు ఆవేదన చెందారు. వైసీపీ పాలకులు దళిత రైతులను పిలిపించి బెదిరించడమే కాకుండా వారిని ఆ ప్రాంతాల నుంచి బలవంతంగా వెళ్లగొట్టారు. దళిత రైతులు అప్పటి జిల్లా కలెక్టర్‌కు స్పందనలో పలుమార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ అవి బుట్టదాఖలు అయ్యాయన్న ఆరోపణలు ఉన్నాయి.

● ధూళిపాళ్ల అలుపెరగని పోరాటం

గ్రావెల్ మాఫియా ఆగడాలతో విసిగెత్తిన పలు గ్రామాల ప్రజలు అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ స్పందన లేకపోవడంతో స్వయంగా ప్రస్తుత ఎమ్మెల్యే, అప్పటి ప్రతిపక్ష నాయకుడు ధూళిపాళ్ల నరేంద్రకుమార్ రంగంలోకి దిగారు. గ్రావెల్ మాఫియా ఆగడాలను బయట పెట్టేందుకు ధూళిపాళ్ల చేయని ప్రయత్నం లేదు. క్వారీల సందర్శనకు వెళ్లడానికి ప్రయత్నించిన ప్రతిసారి నరేంద్రకుమార్‌కు ప్రభుత్వం నుంచి ప్రతిఘటనే ఎదురయింది. అక్రమ నిర్బంధాలు, హౌస్ అరెస్టుల పేరుతో నరేంద్రకుమార్‌ను ఆప్రాంతానికి వెళ్లకుండా పోలీసులు అడ్డుకునేవారు. వీటిని సమర్థంగా ఎదుర్కొంటూనే నరేంద్ర కుమార్ క్వారీల వద్దకు చేరుకుని అక్రమ మైనింగ్ గుట్టును బయటపెట్టారు. మైనింగ్ జరిగిన ప్రాంతాలలో రెండు రోజుల పాటు రాష్ట్ర స్థాయి టీడీపీ నేతలతో పాదయాత్ర జరిపి రాత్రి వేళ క్వారీ భూముల లోనే నిద్రించి వాస్తవాలను వెలుగులోకి తెచ్చారు. డ్రోన్ విజువల్స్ సహాయంతో మైనింగ్ విధ్వంసాన్ని కేజీఎఫ్ పేరుతో విడుదల చేశారు.సుమారు 700 ఎకరాలలో రూ.2 వేల కోట్ల ఎర్ర గ్రావెల్ తవ్వకాలు సాగాయని టీడీపీ నిజనిర్ధారణ కమిటీ ప్రకటించింది. అంతేకాకుండా నేటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సైతం నరేంద్రకుమార్ పోరుబాటకు సంఘీభావం తెలిపి అధికారంలోకి రాగానే కేజీఎఫ్ తరహాలో జరిగిన అక్రమ మైనింగ్‌పై సమగ్ర విచారణ జరుపుతామని ప్రకటించారు. నేడు సబ్‌కలెక్టర్ స్థాయి విచారణ ప్రారంభం కావడంతో అక్రమాల లోగుట్టు వీడుతుందని చేబ్రోలు మండలంలోని పలు గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తంచేస్తున్నారు.



మట్టి తవ్వకాలపై నిరసన తెలిపిన ఎమ్మెల్యే నరేంద్రకుమార్‌ను క్వారీ నుంచి అరెస్టు చేసి తీసుకెళ్తున్న పోలీసులు (ఫైల్)



వీరనాయకునిపాలెంలో మట్టి తవ్వకాలను అడ్డుకున్న దళితులు (ఫైల్)

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

పెదనందిపాడు, ఫిబ్రవరి, 21 (ఆంధ్రజ్యోతి) : పెదనందిపాడు, నాగులపాడు, అన్నవరం గ్రామాలకు శనివారం విద్యుత్ నిలిపివేయనున్నట్లు ఏఈ వీరాంజనేయులు శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

మాతృభాషా దినోత్సవం

దుగ్గిరాల, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని స్థానిక జిల్లాపరిషత్ బాలికోన్నత పాఠశాలలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. తెలుగుతల్లి వేషధారణలో చిన్నారులు అలరించారు. విద్యార్థినులు తెలుగుభాష గొప్పతనాన్ని తెలియజేసే నృత్య గీతాలతో ఆకట్టుకున్నారు. తెలుగు సంప్రదాయాలను ప్రతిబింబించేలా రైతులు, పొలం పనిచేసే మహిళ, కూచిపూడి నృత్యప్రదర్శన, తెలుగుదనం ఉట్టిపడేలా పలువురు మహానాయకుల జీవితాలను కళ్లకు కట్టినట్లు ప్రదర్శించారు. ఉపాధ్యాయినులు నాగలక్ష్మి, నాగేంద్రమణి, నాగకృష్ణకుమారిల శిక్షణలో పలు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శానంపూడి శోభారాణి పర్యవేక్షణలో కార్యక్రమాలు జరిగాయి.

సమస్యలు పరిష్కరించాలి

మంగళగిరి, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో శుక్రవారం ఎంటీఎంసీ అధికారులకు వినతిపత్రం అందజేశారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు అన్నవరపు ప్రభాకర్‌రావు, గండికోట దుర్గారావు మాట్లాడుతూ కార్మికులకు వేతనాలు మున్సిపల్ శాఖ నుంచే ఇవ్వాలని, ఇంజనీరింగ్, పారిశుధ్య కార్మికులను పర్మినెంట్ చేయాలని, నగర జనాభా ప్రాతిపదికన కార్మికుల సంఖ్యను పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ నేతలు హరిబాబు, తాడిశెట్టి శ్రీనివాసరావు, కఠారి వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ బలోపేతానికి కృషి

మంగళగిరి, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి నియోజకవర్గంలో నూతనంగా నియమితులైన వైసీపీ అనుబంధ విభాగాల అధ్యక్షులు పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఆ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ దొంతిరెడ్డి వేమారెడ్డి సూచించారు. వైసీపీ అనుబంధ విభాగాల అధ్యక్షులు శుక్రవారం మంగళగిరి వైసీపీ కార్యాలయంలో వేమారెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ అధికారంలో ఉంటే సంక్షేమ పథకాలన్నీ ప్రజలకు అందేవన్నారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి చైతన్యవంతం చేయాలని, రాబోయే రోజుల్లో ప్రతి కార్యకర్తకు పార్టీ అండగా ఉంటుందని చెప్పారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

తాడికొండ(లాం)ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు తప్పకుండా పాటించాలని తాడికొండ ఎస్.ఐ జేత్యనాయక్ పేర్కొన్నారు. శుక్రవారం తాడికొండ మండలం లాం గ్రామంలోని ఆచార్య ఎన్.జీ.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం అనుబంధం కమ్యూనిటీ సైన్స్ కాలేజ్‌లో రోడ్డు భద్రత, ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్.ఐ నాయక్ మాట్లాడుతూ వాహనాలు నడిపే వారు లైసెన్సులు తప్పకుండా తీసుకోవాలన్నారు. కండిషన్‌లో ఉన్న వాహనాలు మాత్రమే నడపాలని పేర్కొన్నారు. త్రిబుల్ రైడింగ్, మద్యం తాగి వాహనాలు నడపరాదన్నారు. డ్రైవింగ్ చేసేటప్పుడు హెల్మెట్ పెట్టుకోవాలన్నారు. కార్ డ్రైవింగ్ చేసే సమయంలో సీట్ బెల్ట్ తప్పనిసరిగా పెట్టుకోవాలన్నారు. స్పీడ్‌గా వెళ్లరాదని హితవు పలికారు. గుంటూరు ఈస్ట్ ట్రాఫిక్ జోన్ ఎస్.ఐ డి.రవీంద్రబాబు, అసోసియేట్ డీన్ ఎన్.ఎస్.ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

తడి, పొడి చెత్తను వేరుచేయాలి

తాడికొండ(మోతడక) ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లోని ప్రజలు ఇళ్లలోని చెత్తను తడి, పొడి చెత్తను వేర్వేరు చేయాలని ఈవోపీఆర్‌డీ సాయిలీల పేర్కొన్నారు. వన్ బ్యాగ్-వన్ బిన్ కార్యక్రమంలో భాగంగా తాడికొండ మండలం మోతడక గ్రామంలో ఇంటింటికీ తిరిగి శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సాయిలీల మాట్లాడుతూ ఇంటిని ఏవిధంగా పరిశుభ్రంగా ఉంచుకుంటున్నారో, గ్రామాన్ని కూడా అదేవిధంగా శుభ్రంగా ఉంచాలన్నారు. పరిశుభ్రతను పాటించటం వలన ఎలాంటి రోగాలు దరిచేరవన్నారు. ఇంట్లో వచ్చే చెత్తను రెండుగా విభజించాలన్నారు. చెత్తతో సంపదను సృష్టించవచ్చుని పేర్కొన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అనిల్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో తాడేపల్లి విద్యార్థికి స్థానం

తాడేపల్లి టౌన్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి సిప్ అబాకస్ అకాడమి విద్యార్థిని మామిడి శ్రీసాయిరత్న సాన్వి గణితరంగంలో తన ప్రతిభను చాటుతూ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ -వరల్డ్ లార్జెస్ట్ ఆన్‌లైన్ ఇంటర్ అబాకస్ ఒలింపియాడ్ పోటీలలో విజేతగా నిలిచి సత్తా చాటింది. సిప్ అబాకస్ జాహ్నవి మార్గశిక్షణ, మార్గదర్శకత్వంలో సాన్వి ఈ ప్రతిభ చాటింది. ప్రపంచవ్యాప్తంగా వేలాది మంది విద్యార్థులు పాల్గొన్న ఈ పోటీలలో సాన్వి విజేతగా నిలిచి సిప్ అబాకస్ తాడేపల్లికి గుర్తింపు తెచ్చింది. ఇటీవల జనవరిలో హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లోనూ విజేతగా గెలిచి ఐదు నిమిషాల్లో వంద ప్రశ్నల్లో 90కి పైగా ప్రశ్నలకు సరియైన సమాధానం చెప్పి పతకాన్ని గెలుచుకుంది. సాన్వి విజయం పట్ల శిక్షణ ఇచ్చిన జాహ్నవి సాన్విని అభినందించారు.

కక్షలు, కార్పణ్యాలు వద్దు

- అక్షరమే ఆయుధంగా సుఖమయ జీవితం
- 'వారధి' కార్యక్రమంలో ఎస్పీ సతీష్ కుమార్
- ఎస్సీ కాలనీల్లో స్థానికులతో మమేకం



గారపాడు ఎస్సీ కాలనీలో మాట్లాడుతున్న ఎస్పీ సతీష్ కుమార్, డీఎస్పీ భానోదయ తదితరులు

వట్టిచెరుకూరు, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): కక్షలు, కార్పణ్యాలకు పోయి జీవితాలను చిన్నాభిన్నం చేసుకోవద్దని, అక్షరమే ఆయుధంగా సుఖమయమైన జీవితానికి స్వాగతం పలకాలని ఎస్పీ సతీస్ కుమార్ పిలుపు నిచ్చారు. మండలంలోని గారపాడు గ్రామ పంచాయతీ పరిధిలోని ఎస్సీ కాలనీలో, యామర్రు గ్రామ ఎస్సీ కాలనీలో శుక్రవారం రాత్రి నిర్వహించిన వారధి కార్యక్రమానికి ఎస్పీ సతీష్‌కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక ప్రజలతో మమేకమయ్యారు. అనంతరం స్థానికులతో ఎస్పీ మాట్లాడుతూ స్వల్ప వివాదాలు, కక్షలు, కార్పణ్యాలను పెంచుకొని ఉన్న ఊరికి, కుటుంబాలకు దూరమై ఎంతో ఎక్కడెక్కడో దుర్భర జీవితాన్ని గడుపుతున్నారన్నారు. ప్రశాంత జీవనం వ్యక్తి, కుటుంబ ఎదుగుదలకు దోహదపడుతుందన్నారు. సురక్షిత మైన సమాజాన్ని నిర్మించటానికే ప్రజలతో మమేకానికి పోలీసు శాఖ ఎప్పుడూ పరితపిస్తుందన్నారు. గ్రామాల్లో ఎవరూ ఎలాంటి చిన్న వివాదాలకు తావు ఇవ్వవద్దని, ఏదైనా విభేదాలువస్తే క్షణికావేశాలకు లోను కాకుండా పోలీసు శాఖ ఉందన్న విషయాన్ని గుర్తుచేసుకోండని సూచించారు. గతలో కంటే గారపాడు, యామర్రు గ్రామాల కాలనీవాసుల్లో ఎంతో మార్పు, ప్రజలు సత్ ప్రవర్తనతో జీవిస్తున్నారని తాను భావిస్తున్నట్లు తెలిపారు. డీఎస్పీ భానోదయ మాట్లాడుతూ పల్లె సీమలు ఆప్యాయతలకు, అనురాగాలకు గుర్తింపును ఇస్తాయన్నారు. చిన్నచిన్న అపార్థాలతో, విద్వేషాలు పెంచుకొని, కక్షలకు పోయి జీవితాలను బలి చేసుకో వద్దని స్థానికులకు సూచించారు. అలాగే దుర అలవాట్లు, వ్యసనాలు, అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని కాలనీవాసులకు సూచించారు.

చిన్నారులతో ఎస్పీ సెల్ఫీ సందడి..

కార్యక్రమంలో ఎస్పీ, డీఎస్పీ, ఎస్ఐలను రెండు కాలనీలవాసులు శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎస్పీ కాలనీవాసులతో, చిన్నారులతో సెల్ఫీలు దిగి సందడి చేశారు. ప్రజల ఆప్యాయతకు ఎప్పుడూ కృతజ్ఞతగా ఉంటామని ఈ సందర్భంగా ఎస్పీ అన్నారు. కార్యక్రమంలో సీఐ రమానాయక్, ఎస్ఐ సుబ్బారావు, గారపాడు, యామర్రు ఎస్సీ కాలనీ వాసులు తాడివీరయ్య, సుధాకర్, మహిళలు పాల్గొన్నారు. సందర్భంగా ఎస్పీ, డీఎస్పీ చిన్నారులకు చాక్లెట్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు.



చిన్నారులతో సెల్ఫీ దిగుతున్నఎస్పీ సతీష్‌కుమార్



పెదనందిపాడులో ప్రచారం నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు

ముమ్మరంగా ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారాలు

- పట్టభద్రులను కలుస్తున్న ఆలపాటి, కెఎస్ మద్దతుదారుల

తాడేపల్లి టౌన్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి పట్టణంలోని 2వ వార్డులో ఈ నెల 27న జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్‌కు మొదటి ప్రాధాన్యతా ఓటు వేసి గెలిపించాలని కోరుతూ నేతలు, కార్యకర్తలు ప్రచారం నిర్వహించారు. కరపత్రాలు పంపిణీ చేసి రాజేంద్ర ప్రసాద్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు కోగంటి వెంకటేశ్వరరావు, బుర్రముక్కు శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

తాడేపల్లి (ఇప్పటం), (ఆంధ్రజ్యోతి): కృష్ణా గుంటూరు ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కెఎస్ లక్ష్మణరావు విజయాన్ని కాంక్షిస్తూ ఇప్పటం గ్రామంలో శుక్రవారం ప్రజా సంఘాల నాయకులు విస్తృత ప్రచారం నిర్వహించారు. రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తున్న లక్ష్మణరావుకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నేతలు దొంతిరెడ్డి వెంకటరెడ్డి, పల్లె కృష్ణ, డీవైఎఫ్ఐ నేత పల్లె భార్గవ్ తదితరులు పాల్గొన్నారు.

దుగ్గిరాల, (ఆంధ్రజ్యోతి): మండలంలోని కెఆర్‌కొండూరు, ఈమనిగ్రామాల్లో కెఎస్ లక్ష్మణరావు మద్దతుదారులు ఇంటింటికీ తిరిగి ప్రచారం కొనసాగించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు జెట్టి బాలరాజు, భీమవరపు అమ్మిరెడ్డి, యేమినేని స్టాలిన్ తదితరులు పాల్గొన్నారు.

పెదనందిపాడు, (ఆంధ్రజ్యోతి): పట్టభద్రులు తమ తొలి ప్రాధాన్యత ఓటును కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజాకు వేసి గెలిపించాలని జిల్లా తెలుగుయువత ఉపాధ్యక్షుడు చాగంటి సత్యహర్ష అన్నారు. మండల తెలుగుయువత ఆధ్వర్యంలో పెదనందిపాడులో ఆలపాటికి మద్దతుగా ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా తెలుగురైతు కార్యదర్శి మోపర్తి చెంచయ్య, నాయకులు పోపూరి లక్ష్మీనారాయణ, నూతి సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నేతలు పెదనందిపాడులో ఇంటింటికీ తిరిగి పట్టభద్రులను కలిసి ఆలపాటికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ టీడీపీ అధ్యక్షుడు రావి శివరామకృష్ణయ్య, నాయకులు కుర్రా హరిబాబు, దివ్వి నాగరాజు, నూతి శ్రీనివాసరావు, లావు అనిల్, మేడిద సుధాకర్, లావు సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

దుగ్గిరాల,(ఆంధ్రజ్యోతి): మండల గ్రామం కెఆర్ కొండూరులో టీడీపీ మండల అధ్యక్షురాలు కేసంనేని శ్రీఅనిత, స్థానిక నేతలతో కలిసి కారుమంచి గోవిందయ్య హైస్కూల్లోని ఉపాధ్యాయులను, గ్రామంలోని పట్టభద్రులను కలిసి ఆలపాటి రాజేంద్రప్రసాదుకి ఓటు వేయాలని అభ్యర్థించారు. దుగ్గిరాలలో జరిగిన ఎన్నికల ప్రచారంలో గూడూరు వెంకట్రావు, వల్లూరు నరసింహారావు, పర్వతనేని హర్షవర్ధన్, దేవరపల్లి చంటి, ఎద్దు ప్రసాద్, పాల్గొన్నారు.

ప్రైమరీ స్కూలుని జడ్పీ హైస్కూలుగా మార్చాలి



కలెక్టరుకి వినతి పత్రం అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

కాకుమాను(కొండపాటూరు), ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కొండపాటూరు మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలగా అప్‌గ్రేడ్ చేయాలని కోరుతూ గ్రామానికి చెందిన పూర్వ విద్యార్థులు శుక్రవారం గుంటూరు కలెక్టరేట్‌లో కలెక్టర్ నాగలక్ష్మీని కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం పూర్వ విద్యార్థులు యర్రాకుల దానయ్య, టీడీ ప్రసాద్, యార్లగడ్డ అంకమ్మ, సురేంద్ర, టీడీ ప్రసాద్‌లు మాట్లాడుతూ పాఠశాలలో 6,7,8 తరగతుల విద్యార్థులు 46 మంది ఉన్నారన్నారు. మరో 14 మంది విద్యార్థులు పాఠశాలలో చేరే అవకాశం ఉందన్నారు. ప్రభుత్వ జీవో ప్రకారం హైస్కూల్‌కు మూడున్నర కిలోమీటర్ల దూరంలో పాఠశాల ఉందని పాఠశాలలో ఉన్న విద్యార్థులను కాకుమాను జడ్పీ పాఠశాలకు తరలించవద్దని కలెక్టర్ నాగలక్ష్మీకు విజ్ఞప్తి చేశారు. అలాగే ఇటీవల దాతల సహకారంతో రూ.2.50లక్షల వ్యయంతో ఐఎఫ్‌పీ టెక్నాలజీ సిస్టంతో స్మార్ట్ రూమ్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ముత్తినేని కోటేశ్వరరావు, బొంతగర్ల శ్యామ్, తదితరులు పాల్గొన్నారు.

గృహాలకు మరమ్మతులు చేపట్టాలి

- ఏపీ లీగల్ సెల్ కన్వీనర్ న్యాయవాది నాగరాజు

తాడేపల్లిటౌన్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): కొన్ని దశాబ్దాల క్రితం ప్రభుత్వ పథకం కింద నిర్మించుకున్న శాశ్వత, పక్కాగృహాల మరమ్మతులను ప్రభుత్వం వెంటనే చేపట్టాలని ఏపీ స్టేట్ లీగల్ సెల్ కన్వీనర్, న్యాయవాది చిలువూరు నాగరాజు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గృహాల శ్లాబులకు పగుళ్లిచ్చి రంధ్రాలు ఏర్పడటంతో పేదల ప్రజలు ప్రమాదాల బారిన పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణమే ఆయా గృహాలకు మరమ్మతులు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ విషయమై చిలువూరు వాసులతో కలిసి మాదిగ కార్పొరేషన్ చైర్మన్ ఉండవల్లి శ్రీదేవికి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఉసురుపాటి బ్రహ్మయ్య మాదిగ, నలుకుర్తి కోటేశ్వరరావు మాదిగ, కసుకుర్తి నవీన్ మాదిగ, కుక్కమళ్ల శేఖర్‌మాదిగ, కనపాల బాజిమాదిగ, కోడూరి అరవింద్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

బాలలపై లైంగిక నేరాల నివారణకు కృషిచేద్దాం

- రాష్ట్ర లీగల్‌సెల్ కార్యదర్శి మజ్జ బబిత



మాట్లాడుతున్న రాష్ట్ర లీగల్ సెల్ కార్యదర్శి బబిత

తుళ్లూరు,ఫిబ్రవరి21(ఆంధ్రజ్యోతి): బాలలపై జరిగే సైబర్, లైంగిక నేరాలను అరికట్టటానికి సమైక్యంగా కృషిచేద్దామని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ సభ్యకార్యదర్శి మజ్జ బబిత అన్నారు. బాలలపై ఇంటర్నెట్ ఆధారంగా జరుగుతున్న లైంగిక నేరాల నివారణకు ఇండియన్ చైల్డ్ ప్రొటెక్షన్(ఐసీపీ) స్వచ్ఛంద సంస్థ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో రాజధానిలోని వెంకటపాలెం చిగురు బాలలగ్రామంలో శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బబిత మాట్లాడుతూ చట్టాన్ని అమలు పరిచే పోలీసులు సైబర్ నేర విభాగం అధికారులు, చైల్డ్ వెల్ఫేర్ కమిటీసభ్యులు, విద్యాసంస్థలు బాలలపై అకృత్యాలను ఆపటానికి ముఖ్య భూమిక పోషిస్తారని తెలిపారు. చైల్డ్ సెక్సువల్ ఎక్స్‌ప్లైటేషన్ అండ్ అబ్యూస్ మెటీరిల్ (సీఎస్ఇఏఎం)నేరాలను విచారణ చేయటానికి సెక్షన్ -15 ఆఫ్ పోక్సో యాక్ట్, సెక్షన్ 67(బి) ఆఫ్ ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ చట్టంపైన మరింత శిక్షణ పొందాల్సి ఉందన్నారు. బాధిత బాలలకు స్వచ్ఛంద సంస్థలు బాసటగా నిలవాలని కోరారు. ఐసీపీ స్వచ్ఛంద సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పూర్ణబెహరా మాట్లాడుతూ ఈ తరహా సైబర్ నేరాలు ఏ విధంగా జరుగుతాయో వివరించారు. పిల్లల పరివర్తనలో తేడాలున్నాయా.. అని గమనిస్తూ ఉండాలని తల్లిదండ్రులకు సూచించారు. ఏపీ సీఐడీ సైబర్ క్రైమ్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ కె.కృష్ణ ప్రసన్న మాట్లాడుతూ ఈ తరహా నేరాలు జరిగిన వెంటనే 1930 టోల్ ఫ్రీనెంబర్‌ను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ ఉప కార్యదర్శి డాక్టర్ హెచ్ అమర లింగేశ్వరావు, ఇండియా చైల్డ్‌ప్రొటెక్షన్ ఎన్జీవో కిరణ్ సావన్త్, ఆదిత్యా, పోలీసు, విద్యా, శిశు సంక్షేమ శాఖల అధికారులు, ఎన్జీవోలు, సైబర్ క్రైమ్ పోలీసులు, ఐసీపీ సభ్యులు పాల్గన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న విజ్ఞాన్ డీమ్డ్ యూనివర్సిటీ వీసీ పీ.నాగభూషణ్

నూతన వ్యాపార అవకాశాలు సృష్టించాలి

- విజ్ఞాన్ డీమ్డ్ యూనివర్సిటీ వీసీ పీ.నాగభూషణ్

తాడికొండ(లాం)ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): ఇన్నోవేషన్ ద్వారా నూతన వ్యాపార అవకాశాలు సృష్టించి దేశ ఆర్థిక వ్యవస్థను మరింత బలోపేతం చేయవచ్చని విజ్ఞాన్ డీమ్డ్ యూనివర్సిటీ వీసీ డాక్టర్ పీ.నాగభూషణ్ తెలిపారు. లాం చలపతి ఇంజనీరింగ్ కళాశాలలో ఇన్నోవేషన్ అండ్ స్టార్టప్‌పై శుక్రవారం జాతీయస్థాయి వర్క్‌షాప్ నిర్వహించారు. ముఖ్య అతిథి హాజరైన నాగభూషణ్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు మార్కులకోసం కాకుండా జ్ఞాన సముపార్జన ధ్యేయంగా చదువుకోవాలన్నారు. కొత్త ఆవిష్కరణలు, సృజనాత్మక ఆలోచనల ద్వారా యువత దేశాభివృద్ధిలో కీలక పాత్ర పోషించాలన్నారు. స్పేస్ ఇన్ఫో టెక్నాలజీస్ వ్యవస్థాపకురాలు డాక్టర్ శ్రీదేవి తాళ్లూరి మాట్లాడుతూ సాంకేతికత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఈ యుగంలో స్టార్టప్ కల్చర్‌ను ప్రోత్సహించడం అత్యంత అవసరమన్నారు. ఇన్నోవేషన్ ద్వారా ప్రపంచంలో మార్పును తీసుకురావడం యువత బాధ్యతగా భావించాలని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరి వై.సుజిత్‌కుమార్, ఇన్నోవేషన్ నిపుణులు డాక్టర్ కే. నరసింహరాజు, ప్రిన్సిపాల్ మేడా చంద్రశేఖర్, కళాశాల ట్రైనింగ్ అండ్ కార్పొరేట్ రిలేషన్స్ డీన్ చందు రవిశంకర్, అకడమిక్ డీన్ డాక్టర్ జే.లక్ష్మీ నారాయణ పాల్గొన్నారు.

విజ్ఞాన్ యూనివర్సిటీలో

ఆన్‌లైన్ సర్టిఫికెట్ కోర్సు ప్రారంభం

పెదనందిపాడు, ఫిబ్రవరి, 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక పీఏఎస్ కళాశాలలో డిగ్రీ, ఎంసీఏ విద్యార్థులకు విజ్ఞాన్ యూనివర్సిటీ వడ్లమూడి వారు పైలెట్ ప్రాజెక్ట్ క్రింద ఉచితంగా డేటా సైన్స్ యూసింగ్ పైథాన్ అనే ఆన్లైన్ సర్టిఫికెట్ కోర్సును శుక్రవారం ప్రారంభించారు. యూనివర్సిటీ సీడీవో డైరెక్టర్, అధ్యాపకులు ఎన్ వీ రాంజనేయులు, అడిషనల్ డైరెక్టర్ కల్పన, శిక్షకులు ఏ ప్రవీణ్‌కుమార్‌లు ఈ కోర్సు ప్రాధాన్యాన్ని విద్యార్థులకు వివరించారు. ప్రతి శుక్ర, శనివారాల్లో 10 వారాల పాటు 30 క్లాసులు నిర్వహించడం జరుగుతుందని, కోర్సు పూర్తి చేసి పరీక్ష నిర్వహించడం జరుగుతుందని. పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన వారికి విజ్ఞాన్ యూనివర్సిటీ నుండి సర్టిఫికెట్ అందజేయడం జరుగుతుందని తెలిపారు. కోర్సు ఏర్పాటు చేసి విజ్ఞాన్ విద్యాసంస్థల లావు రత్తయ్య, నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయులుకు కళాశాల పాలకవర్గ సభ్యులు, అధ్యాపకులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వీరరాఘవయ్య, వైస్ ప్రిన్సిపాల్ ప్రతాప్, వ్యాయామ అధ్యాపకులు పాతూరి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న విజ్ఞాన్ యూనివర్సిటీ అడిషనల్ డైరెక్టర్ కల్పన



కేఎల్‌యూలో విద్యార్థులకు సీపీఆర్‌లో శిక్షణ ఇస్తున్న ఎయిమ్స్ వైద్య బృందం

సీపీఆర్ ప్రథమ చికిత్సపై కేఎల్‌యూ విద్యార్థులకు శిక్షణ

తాడేపల్లి (వడ్డేశ్వరం), ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): ఎంటిఎంసి పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీలో గుండెపోటుకు గురైన వారికి అత్యవసర సమయంలో చేయాల్సిన సీపీఆర్ ప్రథమ చికిత్స గురించి విద్యార్థులకు శిక్షణ కార్యక్రమాన్ని స్మార్ట్ విలేజ్ రివల్యూషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. మంగళగిరి ఎయిమ్స్ వైద్యుల భాగస్వామ్యంతో శిక్షణ కార్యక్రమంతో నిర్వహించినట్లు సాక్ డైరెక్టర్ పి.సాయి విజయ్ తెలిపారు. ఈ కార్యక్రమానికి సుమారు 1000 మంది విద్యార్థులు హాజరై సీపీఆర్ ద్వారా అత్యవసర పరిస్థితులలో ప్రాణాలను రక్షించే పద్ధతుల గురించి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వర్సిటి ఇన్‌చార్జ్ వీసీ డాక్టర్ కె రాజశేఖరరావు, ప్రోవీసీలు డాక్టర్ ఎవిఎస్ ప్రసాద్, విద్యార్థి సంక్షేమవిభాగం ఇన్‌చార్జిడీన్ డాక్టర్ కెఆర్ఎస్ ప్రసాద్, సాక్ డైరెక్టర్ పి సాయివిజయ్, ఎయిమ్స్ ఆసుపత్రి వైద్యుల బృంద సభ్యులు, సాక్ కోఆర్డినేటర్‌లు పివి.సత్యనారాయణ పాల్గొన్నారు.

భావనారుషి స్వామిని దర్శించుకున్న వీసీ బసవరావు

మంగళగిరి సిటీ, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): కర్నూలు రాయలసీమ యూనివర్సిటీ వైస్‌చాన్సలర్‌గా నియమితులైన డాక్టర్ ఉడతా వెంకట బసవరావు శుక్రవారం మంగళగిరి విచ్చేశారు. స్థానిక నాంచారమ్మ చెరువు ప్రాంగణంలో కొలువైన శ్రీ భద్రావతి సమేత భావనారుషి స్వామివార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మంగళగిరి పట్టణ పద్మశాలీయ బహూత్తమ సంఘం ఆధ్వర్యంలో వీసీ బసవరావును ఘనంగా సన్మానించారు. సంఘం ఉపాధ్యక్షుడు గుత్తికొండ ధనుంజయరావు మాట్లాడుతూ చేనేత కుటుంబానికి చెందిన ఉడతా బసవరావు రాయలసీమ యూనివర్సిటీ వీసీగా బాధ్యతలు చేపట్టడం పట్ల హర్షం వ్యక్తంచేశారు. ఆయన నియామకానికి సిఫారసు చేసి చేనేతలను గౌరవించిన మంత్రి లోకేశ్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం కోశాధికారి గంజి రవీంద్రనాథ్, సహాయ కార్యదర్శి రామనాథం పూర్ణచంద్రరావు, వంగర లక్ష్మయ్య, జొన్నాదుల బిక్షారావు, బిట్రా భాస్కరరావు, వీరరాఘవులు పాల్గొన్నారు.



స్వామిని దర్శించుకున్న ఉపకులపతి బసవరావు

డంపింగ్‌యార్డును పరిశీలించిన విశాఖ అధికారుల బృందం

ప్రత్తిపాడు (తుమ్మలపాలెం), ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): ఘన వ్యర్థ పదార్థాల నుంచి చెత్తను వేరేచేసే విధానాన్ని పరిశీలించేందుకు విశాఖ జిల్లా నుంచి 40 మంది ప్రత్యేక బృందం మండల పరిధిలోని తుమ్మలపాలెంలో శుక్రవారం పర్యటించింది. విశాఖపట్నం జిల్లా పెందుర్తి, ఆనందపురం మండలాల పరిధిలోని 20 గ్రామాల నుంచి 40 మంది ప్రతినిధులు గ్రామంలో పర్యటించారు. తుమ్మలపాలెంలోని ఎస్‌డబ్ల్యుపీసీ షెడ్ నిర్వహణ, అందులో నాడెప్‌లలో వర్మీ కంపోస్టు తయారీ విధానంతో పాటు డంపింగ్ యార్డులో మొక్కల పెంపకం, అక్కడ ఉన్న ఆహ్లాదకర వాతావరణాన్ని వారు పరిశీలించారు. అంతేకాకుండా గ్రామంలో వ్యర్థ పదార్థాల సేకరణ చేసే విధానం, తడి, పొడి చెత్తను వేరు చేసే విధానంతో పాటు క్లాప్ మిత్రాలు పనిచేసే తీరును పంచాయతీ సెక్రటరీ ఖాజా వారికి వివరించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డి రవికుమార్, సీవైడీఏ ఫీల్డ్ కోఆర్డినేటర్ లక్ష్మీనారాయణ, అనురాధ, కరిముద్దీన్, డీ శ్రీనివాసరావు, సురేష్, శ్రీనివాసరావు, ఉమామహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



వైజాగ్ నుంచి వచ్చిన బృందానికి డంపింగ్ యార్డు గురించి వివరిస్తున్న పంచాయతీ కార్యదర్శి ఖాజా

విద్యుత్ చార్జీల పెంపును నిలిపివేయాలి

- సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు రామారావు



సమావేశంలో మాట్లాడుతున్న పాశం రామారావు

పెదనందిపాడు, ఫిబ్రవరి, 21 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం విద్యుత్ చార్జీల పెంపు నిలుపుదల చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు పాశం రామారావు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో ఆ పార్టీ మండల కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా రామారావు మాట్లాడుతూ విద్యుత్ చార్జీల పెంపు సామాన్యులు, చిరువ్యాపారులు, చేతివృత్తిదారులకు పెను భారంగా మారిందని, దీనిపై త్వరలో ఆందోళన కార్యాక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. స్మార్ట్ మీటర్లు వినియోగదారులకు అనుమతి లేకుండానే బిగిస్తున్నారని విమర్శించారు. తొలుత ఎమ్మెల్సీ పీడీఎఫ్ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావుకు మద్దతుగా ప్రచారం నిర్వహించి, భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి దొప్పలపూడి రమేష్‌బాబు, నాయకులు జంపని రామారావు, కొత్త వెంకటశివ, తదితరులు పాల్గొన్నారు.

క్రీడలు ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయి

- భాష్యం విద్యాసంస్థల వ్యవస్థాపకులు భాష్యం రామకృష్ణ



పోటీలను ప్రారంభిస్తున్న భాష్యం రామకృష్ణ, వై.వి.ఆంజనేయులు

తాడికొండ(లాం)ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): క్రీడలు మనోబలాన్ని, ఆత్మవిశ్వాసాన్ని, సమర్థతను, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని భాష్యం విద్యాసంస్థల వ్యవస్థాపకులు భాష్యం రామకృష్ణ పేర్కొన్నారు. శుక్రవారం లాం చలపతి ఫార్మసీ కళాశాలలో సీఎల్‌పీటీ మిలానోత్సవ్ 4.0 రాష్ట్రస్థాయి క్రీడా పోటీలను ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన భాష్యం రామకృష్ణ మాట్లాడుతూ కృషి, పట్టుదల, సాధన ఉంటే ఏదైన సాధించవచ్చునని, క్రీడా స్ఫూర్తిని కలిగే విధంగా పోటీల్లో పాల్గొనాలని క్రీడాకారులకు సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ నాదెండ్ల రామారావు మాట్లాడుతూ మిలానోత్సవ్4.0 పోటీలు రెండు రోజుల పాటు జరుగుతాయని తెలిపారు. వాలీబాల్, కబడ్డీ, త్రోబాల్, క్యారమ్స్ చెస్, రన్నింగ్ తదితర 12 రంగాలలో బాల బాలికలకు పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు

ఆర్టీసీ, రవాణాశాఖ అధికారుల తనిఖీలు

● రూ. లక్షా 20వేల అపరాధ రుసుం వసూలు

గుంటూరు, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): చేబ్రోలు మండలంలోని నారాకోడూరు సెంటర్‌లో ఆర్టీసీ గుంటూరు-2 డిపో మేనేజర్ షేక్ అబ్దుల్ సలాం, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు టి.రాఘవరావు, బి.మధుసూదనరావు, జి.అమృతరాణిలు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సరైన పత్రాలు లేని పలు వాహనాలను నిలిపి జరిమానాలు విధించారు. హెల్మెట్ లేని ప్రయాణం ప్రమాకరమని, తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. అలానే ఓవర్ లోడ్‌తో వెళుతున్న వాహనాలను తనిఖీలు చేసి కౌన్సెలింగ్ ఇచ్చారు. సరైన పత్రాలు లేని వాహనాలు ఆపి రూ. లక్షా 20వేలు జరిమానా విధించినట్లు తెలిపారు. తనిఖీల్లో ఆర్టీసీ అసిస్టెంట్ మేనేజర్ సాంబశివ, సెక్యూరిటీ సిబ్బంది ఉన్నారు.

జేఎంజే కళాశాలలో ప్రాంగణ ఎంపికలు

తెనాలి అర్బన్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జేఎంజే మహిళా కళాశాలలో ప్రాంగణ ఎంపికలు నిర్వహించారు. హైదరాబాద్‌కు చెందిన హీరో, ఫాక్స్‌కాన్ సంస్థలు శుక్రవారం విద్యార్థులకు నిర్వహించిన ప్రాంగణ ఎంపికలలో పాల్గొన్నారు. ఈ రెండు సంస్థలకు 109మంది విద్యార్థులకు ఎంపికచేశారు. వీరికి ఏడాదికి రూ.2.40 లక్షలు వేతనం లభిస్తుందని ప్రతినిధులు శివకుమార్ తెలిపారు. ప్రిన్సిపాల్ షైనీ, వైస్ ప్రిన్సిపాల్ శారదామేరీ, కరస్పాండెంట్ థెరీసమ్మ, సుధాకరయ్య పాల్గొన్నారు.

విద్యా సామగ్రి పంపిణీ

తెనాలి రూరల్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సంగంజాగర్లమూడి హైస్కూల్‌లో విద్యార్థులకు పరీక్ష విద్యా సామగ్రి కిట్లను పంపిణీ చేశారు. రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి వైకుంఠపురం ఆధ్వర్యంలో 100 మంది విద్యార్థులకు పరీక్షలకు అవసరమైన మెటీరియల్స్‌ను క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు ఈదర శ్రీనివాసరావు, డి.మురళీకృష్ణ, సర్వీస్ ప్రాజెక్టు డైరెక్టర్ నల్లూరి వెంకటేశ్వరరావు, ఈదర వెంకటపూర్ణచంద్, కన్నెగంటి మురళీకృష్ణ, చేతన్‌రాజ్, కఠారి, కొల్లి రాజేంద్రప్రసాద్, పావులూరి రాంబాబు, కాకుమాను ఉపేంద్ర, రాజశేఖర్ రెడ్డి కలిసి విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా స్కూల్ ప్రిన్సిపాల్ శివరామకృష్ణ క్లబ్ సభ్యులను అభినందించారు. పలువురు విద్యార్థినీ, విద్యార్థులు, స్కూల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అవగాహనతోనే దోమల నిర్మూలన సాధ్యం

● సహాయ మలేరియా అధికారి ప్రభాకరరెడ్డి

తెనాలి, మారీసుపేట, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): అవగాహనతోనే దోమల నిర్మూలన సాధ్యమవుతుందని సహాయ మలేరియా అధికారి చిరసాని ప్రభాకరరెడ్డి అన్నారు. స్థానిక పద్మశాలిపేటలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆరోగ్య సిబ్బంది, సతీష్ పాల్‌రాజ్ నర్సింగ్ కళాశాల విద్యార్థినులకు ఫ్రైడే డ్రైడే అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం మలేరియా సిబ్బంది నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సహాయ మలేరియా అధికారి చిరసాని ప్రభాకరరెడ్డి పాల్గొని ఫ్రైడే డ్రైడేపై అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థినులు ప్రజలకు దోమల ద్వారా వ్యాపించే వ్యాధులపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో సబ్‌యూనిట్ అధికారులు అందె బాలచంద్ర మౌళి, వంగల పున్నారెడ్డి, శ్రీకంఠ ఉమాకాంత్, ఆరోగ్య పర్యవేక్షకులు దీపాల శ్రీనివాసరావు, ప్రసన్న పుష్పలత, హెల్త్ అసిస్టెంట్లు షేక్ రషీద్, సయ్యద్ కరిముల్లా, సంకా శరత్‌బాబు, ఆశా కార్యకర్తలు, నర్సింగ్ విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకులలో పనిభారంపై ఉద్యోగుల నిరసన

తెనాలి అర్బన్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ రంగ బ్యాంకులలో పనిభారం తగ్గించాలని కోరుతూ శుక్రవారం నిరసన ప్రదర్శన చేశారు. కొత్తపేటలోని ఎస్‌బీఐ బజార్ బ్రాంచ్ వద్ద జరిగిన ఆందోళనలో యూనియన్ రీజనల్ కార్యదర్శి ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ, వెంటనే బ్యాంకుల్లో ఉన్న అన్ని ఖాళీలు భర్తీ చేయాలని కోరారు. వారానికి ఐదు రోజుల పని, రాయితీలపై పన్ను మినహాయింపు, గ్రాట్యుటీ సవరించి ప్రభుత్వ ఉద్యోగులకు సమానంగా రూ.25 లక్షలు ఇవ్వాలన్నారు. సమస్యల సత్వర పరిష్కారం లేకుంటే మార్చి 24, 25 తేదీలలో సమ్మెకు వెళతామని హెచ్చరించారు. చంద్రశేఖర్, విశాలాక్షి పాల్గొన్నారు.

ఇమామ్, మౌజన్‌లకు గౌరవ వేతనం విడుదలపై హర్షం

పొన్నూరు టౌన్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): మసీదులలో విధులు నిర్వహిస్తున్న ఇమామ్, మౌజన్‌లకు గౌరవ వేతనాలను ప్రభుత్వం విడుదల చేయడం హర్షణీయం అని టీడీపీ మైనార్టీసెల్ నియోజకవర్గ అధ్యక్షుడు పఠాన్ ఫిరోజ్‌ఖాన్ అన్నారు. శుక్రవారం జరిగిన మైనార్టీ సెల్ సమావేశంలో ఫిరోజ్‌ఖాన్ మాట్లాడుతూ ఇమామ్‌లు, మౌజన్‌లకు మొదటిసారిగా టీడీపీ ప్రభుత్వం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గౌరవ వేతనాలు ఇచ్చారని గుర్తు చేశారు. వైసీపీ ప్రభుత్వంలో చెల్లించాల్సిన ఆరు నెలల బకాయిలను కూడా కూటమి ప్రభుత్వం విడుదల చేయడం అభినందనీయం అన్నారు. ఇమామ్‌లు, మౌజన్‌ల తరపున ప్రభుత్వానికి ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్‌కు ఫిరోజ్‌ఖాన్ కృతజ్ఞతలు తెలిపారు.

మాతృభాషా దినోత్సవం

తెనాలి అర్బన్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): గాంధీనగర్‌లోని ఇస్కఫ్ కార్యాలయంలో శుక్రవారం మాతృభాష దినోత్సవం నిర్వహించారు. తెలుగు వాడుక భాషగా చేసిన పితామహుడు గిడుగు వెంకటరామమూర్తి బాటలో పయనించాలని జిల్లా కార్యదర్శి బెల్లంకొండ వెంకట్ చెప్పారు. నీలాంబరం, బొల్లిముంత కృష్ణ, వెంకటేశ్వరరావు, వీణ తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీకి త్రీ ఫేజ్ విద్యుత్ అందేనా..?

● సంగంజాగర్లమూడిలో వ్యాక్సిన్లు భద్రపరిచే ఫ్రిజ్‌లకు విద్యుత్ సరఫరా అందక ఇక్కట్లు

● సింగల్‌ఫేజ్‌తో తరచూ అంతరాయం

● అధికారులు చొరవ చూపాలని పలువురి డిమాండ్





సంగంజాగర్లమూడి పీహెచ్‌సీ సెంటర్, పీహెచ్‌సీలో సప్లై ఇవ్వకపోవడంతో నిరుపయోగంగా విద్యుత్ బాక్సు



పీహెచ్‌సీలో వ్యాక్సిన్లు భద్రపరిచే ఫ్రిజ్‌లు

తెనాలి రూరల్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంత పేదల ఆరోగ్యానికి భరోసాగా నిలిచేలా మండలంలోని సంగంజాగర్లమూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని రూ.కోట్లు వెచ్చించి నిర్మించారు. ఈ పీహెచ్‌సీలో గర్భిణులకు, బాలింతలకు, ఇతర అనారోగ్య సమస్యలతో వచ్చేవారికి వైద్యసేవలందించేలా వైద్యులు, సిబ్బందిని ఏర్పాటు చేశారు. వైద్యుల సూచనల మేరకు వ్యాధి నిర్ధారణకు అవసరమైన పరీక్షలు జరిపేలా ల్యాబొరేటరీని సైతం అందుబాటులోకి తీసుకువచ్చారు. అంతే కాకుండా వ్యవసాయ గ్రామాలు కావడంతో పాముకాటు, కుక్కకాటు వంటి వివిధ ప్రమాదకరపరిస్థితుల్లో వారిని రక్షించేందుకు అవసరమైన వ్యాక్సిన్లను కూడా అందుబాటులో ఉంచారు. ఇదే పీహెచ్‌సీలో ఆయుర్వేద ఆసుపత్రిని సైతం నిర్వహిస్తున్నారు. నిత్యం వందలాది మంది పరిసర గ్రామాల నుంచి అనారోగ్యసమస్యలతో వచ్చే రోగులతో ఈ పీహెచ్‌సీ నిండుగా ఉంటుంది. ఐతే ఈ ఆరోగ్యకేంద్రంలో విద్యుత్ సరఫరా సమస్యగా మారింది. పీహెచ్‌సీ నూతన భవనంతో ప్రారంభించి దాదాపుగా మూడు సంవత్సరాలు కావస్తున్నా ఇందులో విద్యుత్ సరఫరా మాత్రం పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయలేదు. ఇందుకు విద్యుత్, ఆరోగ్యశాఖ అధికారుల మధ్య సమన్వయ లోపంతో ఈ ఇబ్బంది ఏర్పడిందన్న ఆరోపణలున్నాయి. బిల్డింగ్‌కి త్రీఫేజ్ వైరింగ్ కనెక్షన్ లాగి ఉండగా సప్లై మాత్రం అందించలేదు. ప్రస్తుతం పీహెచ్‌సీకి పక్కనే ఉన్న సింగిల్‌ఫేజ్ మీటర్ ద్వారా విద్యుత్ సప్లై అందుతుంది. అయితే ఈ పీహెచ్‌సీలో మేల్, ఫిమేల్ వార్డులు, మందుల విభాగం, రోగులు వేచిఉండు గది, వైద్యులకు రెండు ప్రత్యేక గదులు, ల్యాబొరేటరీకి ఓ ప్రత్యేక గది, దీనితోపాటు ఆయుర్వేద వైద్యానికి ఓ గది, మందులు నిల్వచేసుకునేందుకు మరో ప్రత్యేక గది ఉన్నాయి. వీటన్నంటికి దాదాపుగా ఫ్యాన్లు, ట్యూబ్‌లైట్లు, కొన్ని ఏసీలు, వ్యాక్సిన్లు నిల్వచేసే ఫ్రిజ్‌లు, ల్యాబొరేటరీలో పరీక్షించేందుకు విద్యుత్ పరికరాలు, ఓపీ ఆన్‌లైన్ నమోదుకు కంప్యూటర్లు వంటివి ఉన్నాయి. వీటన్నింటికి విద్యుత్ సరఫరాలకు సింగిల్‌ఫెజ్‌పై ఉండటంతో లోడ్ ఎక్కువై వైరింగ్ తగలబడటం, లేదా ఫ్యూజ్‌లు కాలిపోవడం వంటివి తరుచూ జరుగుతూ విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతోంది. దీంతో వైద్యశాల సిబ్బంది, అటు రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరోపక్క ఎంతో ఖరీదైన కుక్క కాటు, పాము కాటు, టీడీ ఇంజక్షన్లు, యాంటీబయాటిక్స్ వంటి పలురకాల వ్యాక్సిన్లు, మందులు ఫ్రిజ్‌లలో నిర్ణీత టెంపరేచర్‌లో నిల్వ ఉంచాల్సి ఉంటుంది. విద్యుత్ సప్లై అందుకు అనువుగా లేక అవి కూడా పనిచేయక వ్యాక్సిన్లు పాడైపోయే పరిస్థితి అక్కడ నెలకొంది. భవనానికి అవసరైన విద్యుత్ పరికరాలను దృష్టిలో ఉంచుకుని ఏర్పాటు చేసిన త్రీఫేజ్ లైన్ బాక్సు, వైర్లు సైతం ఆ పరిసరాల్లో నిరుపయోగంగా పడి పిచ్చిమొక్కల నడుమ ఉంది. ప్రభుత్వం రూ.కోట్లు ఖర్చుచేసి వైద్యశాలను నిర్మించినా విద్యుత్ సమస్యతో ఆ భవనంలో సేవలు పూర్తిస్థాయిలో అందే పరిస్థితి లేకుండా పోయింది. సంబంధిత అధికారులు పీహెచ్‌సీలో విద్యుత్ సమస్యపై దృష్టిపెట్టి పరిష్కరించి పేదలకు మంచి సౌకర్యాలతో కూడిన నాణ్యమైన వైద్యసేవలందేలా చూడాలని పలువురు కోరుతున్నారు.

ఆలపాటిని గెలిపించుకుందాం

● రాజేంద్రప్రసాద్ సతీమణి మాధవి



తెనాలి రూరల్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): నిత్యం ప్రజల కోసం పాటుబడే ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను ఎమ్మెల్సీగా అత్యధిక మెజార్టీతో గెలిపించుకుందామని ఆలపాటి మాధవి పిలుపునిచ్చారు. శుక్రవారం పట్టణంలోని పలు కళాశాలల్లో కూటమి శ్రేణులతో కలిసి ఆలపాటి రాజేంద్రప్రసాద్ సతీమణి ఆలపాటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాధవి మాట్లాడుతూ కుటుంబం కన్నా ప్రజలే మిన్నగా భావించే మంచి వ్యక్తిత్వం కలిగిన నాయకుడు ఆలపాటి రాజేంద్రప్రసాద్ అన్నారు. తెనాలి నియోజవర్గంలో శాసనసభ్యుడిగా పోటీచేయాల్సిన రాజేంద్రప్రసాద్ కూటమి చంద్రబాబు ఆదేశాలతో పార్టీ గెలుపు కోసం పాటుబడ్డారని గుర్తుచేశారు. ఆయన సేవలను గుర్తించిన కూటమి నాయకత్వం ఎమ్మెల్సీగా అవకాశం ఇచ్చిందని పట్టభద్రులందరూ ఆలపాటిని ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో పెద్దసంఖ్యలో తెలుగుమహిళలు, కూటమి శ్రేణులు పాల్గొన్నారు.

● తెనాలి, మారీసుపేట: ఈ నెల 27న జరగనున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో మాజీ మంత్రి ఆలపాటిని రాజేంద్రప్రసాద్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని తెలుగుదేశం పార్టీ పట్టణ బీసీ సెల్ అధ్యక్షుడు పణిదపు దుర్గా అన్నారు. శుక్రవారం స్థానిక పాండురంగ పేటలోని 26వ వార్డులో కూటమి నాయకులు, కార్యకర్తలతో కలసి ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో రిజ్వాన్ బాషా, షేక్ కరిముల్లా, షేక్ బాజీ, వెంకటరత్నం, కార్యకర్తలు పాల్గొన్నారు.

● తెనాలి రూరల్: పట్టభద్రులందరికీ అండగా ఉండే ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను ఈ నెల 27న జరగబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలిపించుకుందామని కూటమి శ్రేణులు పిలుపునిచ్చారు. శుక్రవారం మండలంలోని కొలకలూరులో కూటమి కృష్ణా, గుంటూరు ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీచేస్తున్న ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను పట్టభద్రులందరూ ప్రథమ ఓటువేసి గెలిపించాలని కోరుతూ కూటమి శ్రేణులు ఇంటింటి ప్రచారం నిర్వహించి కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గుంటూరు కృష్ణమోహన్, నల్లిపోయిన నాగేశ్వరరావు, జిలాని, సీహెచ్ వెంకటేశ్వర్లు, తాళ్లురు బుజ్జి, నాని, ఝాన్సి, తమ్మిరెడ్డి, హనుమంతరావు, శిరిష, శేషయ్య, లక్ష్మి పలువురు పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

● కొల్లిపర: కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను గెలిపించి ప్రభుత్వానికి అండగా నిలబడాలని టీడీపీ సీనియర్ నాయకుడు, గ్రామపార్టీ అధ్యక్షుడు దాసరి నరసయ్య అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని అత్తోటలో ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి విజయం టీడీపీ, జనసేన నాయకులు ప్రచారాన్ని నిర్వహించారు. గ్రామంలో పట్ట భద్రులను, ప్రభుత్వ ఉద్యోగులను కలిసి మొదటి ప్రాధాన్య ఓటును ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ బొల్లుముంత వెంకటేశ్వరరావు, ఉపసర్పంచ్ దివ్వెల ఏడుకొండలు, టీడీపీ, జనసేన నాయకులు కొఠారు అంజనేయులు, బొద్దులూరు అశోక్, యర్రు కృష్ణార్జున తదితరులు పాల్గొన్నారు.

● కొల్లిపర: ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను గెలిపించటానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని దుగ్గిరాల మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ వంగా సాంబిరెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని తూములూరు, కొల్లిపర, చక్రాయపాలెం తదితర గ్రామాల్లో ఆలపాటి గెలుపు కోసం టీడీపీ, జనసేన నాయకులు ప్రచారాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు భీమవరపు చినకోటిరెడ్డి, టీడీపీ జిల్లా కార్యదర్శి కంచర్ల అమృతరాజు, డీసీ ఉపాధ్యక్షుడు తోట ఏడు కొండలు నీటి సంఘ ఉపాధ్యక్షుడు ఆరిమండ శివనాగమల్లేశ్వరరెడ్డి, టీడీపీ నాయకులు గుదిబండి గోవర్ధనరెడ్డి, అడపాల నాగేశ్వరరావు, చందు సాయిబాబు, జంగా శ్రీనివాసరెడ్డి, కొల్లి కోటిరెడ్డి , బొంతు చంద్రిక తదితరులు పాల్గొన్నారు.



ఆలపాటి గెలుపు కోసం ప్రచారం నిర్వహిస్తున్న టీడీపీ, జనసేన నాయకులు

పీడీఎఫ్ అభ్యర్థిని గెలిపించాలి

సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దండా లక్ష్మీనారాయణ



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న సీఐటీయూ నాయకులు

పొన్నూరు టౌన్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) ఎమ్మెల్సీ ఎన్నికలలో పీడీఎఫ్ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావును మొదటి ప్రాధాన్య ఓటు వేసి గెలిపించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దండా లక్ష్మీనారాయణ కోరారు. శుక్రవారం పట్టణంలోని తెలగపాలెం, రామ మందిరం వద్ద పీడీఎఫ్ ఎమ్మెల్సీ తరపున ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ 18 ఏళ్లుగా లక్ష్మణరావు ఎమ్మెల్సీగా పనిచేస్తూ ప్రజా సమస్యలపై పోరాడారన్నారు. ప్రజల తరపున పోరాడే కేఎస్ లక్ష్మణరావును గెలిపించాలని కోరారు. జాబ్ క్యాలెండర్, స్కీమ్ వర్కర్‌లు సమస్యలు కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలపై లక్ష్మణరావు పోరాడారని గుర్తు చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు రమేష్‌బాబు, భావన్నారాయణ; నాయక్, రాజు, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై పోరాడే వ్యక్తి లక్ష్మణరావు: శివసాంబిరెడ్డి

కొల్లిపర, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): సమస్యలపై పోరాడే వ్యక్తి లక్ష్మణరావును ఎమ్మెల్సీ ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఏపీ రైతు సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రం కొల్లిపరలో లక్ష్మణరావు గెలుపు కోసం సీఐటీయూ, రైతు సంఘ నాయకులు ప్రచారం నిర్వహించారు. పట్టభద్రులను, ఉద్యోగులను కలిసి లక్ష్మణరావుకు ఓటు వేయాలని కోరారు. ఈ సందర్భంగా శివసాంబిరెడ్డి మాట్లాడుతూ విజ్ఞతతో ఆలోచించి ప్రజానేత లక్ష్మణరావును గెలిపిస్తే పాఠశాలలకు, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరిస్తారన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి కోటా చంద్రశేఖర్, శ్రీనివాసరెడ్డి, ఎ.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



లక్ష్మణరావు గెలుపు కోసం ప్రచారం నిర్వహిస్తున్న సీఐటీయూ, రైతు సంఘ నాయకులు

తాజా కూరగాయలతో ఆరోగ్యకరమైన జీవనం

● విశ్రాంత సైన్స్ టీచర్ ధూళిపాళ్ల స్వర్ణలత

తెనాలి రూరల్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): ప్రతిరోజు తీసుకునే ఆహారంలో క్రమం తప్పకుండా తాజా కూరగాయలు, పండ్లతో ఆరోగ్యకరమైన జీవనం గడపవచ్చని విశ్రాంత సైన్స్ టీచర్ ధూళిపాళ్ల స్వర్ణలత అన్నారు. ఈ నెల 28న జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని సైన్స్ ఎగ్జిబిషన్‌లో భాగంగా నందివెలుగు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో శుక్రవారం మండలంలోని పలు పాఠశాలల విద్యార్థులకు కూరగాయలు, పండ్లతో పౌష్టికాహారం తయారుచేయడంపై పోటీలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొని ప్రతిభ కనబరిచారు. విజేతలకు బహుమతులు అందజేశారు. స్కూల్ హెచ్ఎం జి.శివపార్వతి పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో స్కూల్ ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

జీబీఎస్‌పై అప్రమత్తంగా ఉండాలి

● డాక్టర్ అమృత గరికపాటి

పొన్నూరు టౌన్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): గులియన్ బారే సిండ్రోమ్ వ్యాధిపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ అమృత గరికపాటి తెలిపారు. శుక్రవారం పట్టణంలో బాలాజీ హాస్పిటల్ ఆధ్వర్యంలో బర్డ్ ఫ్లూ సర్వేకల్ క్యాన్సర్, జీబీఎస్‌పై అవగాహన సదస్సు జరిగింది. డాక్టర్ అమృత మాట్లాడుతూ సర్వైకల్ క్యాన్సర్, హెపటైటిస్ వ్యాధులు పెరుగుతున్నాయని తెలిపారు. వీటికి తగ్గ వ్యాక్సిన్‌లు వ్యాధులను నివారించవచ్చని సూచించారు. జీబీఎస్ వ్యాధి లక్షణాలు చికిత్స గురించి అవగాహన కల్పించారు. సదస్సులో డాక్టర్ షేక్ ఆస్మా, డాక్టర్ డీ రేణుకుమార్, డాక్టర్ ప్రసన్న కుమార్, డాక్టర్ స్పందన, తదితరులు పాల్గొన్నారు.

మాతృభాషను కాపాడేందుకు కృషి చేయాలి

● సాహిత్యవేత్త పొన్నపల్లి గోపాలకృష్ణమూర్తి

తెనాలి అర్బన్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): మాతృభాషను పదికాలాల పాటు కాపాడేందుకు కృషి చేయాలని సాహిత్యవేత్త పొన్నపల్లి గోపాలకృష్ణమూర్తి చెప్పారు. పెన్షనర్ల సంఘ భవనంలో శుక్రవారం మాతృభాష దినోత్సవం నిర్వహించారు. స్వరలయ వేదిక వ్యవస్థాపకుడు సాయిలక్ష్మరాజును సన్మానించారు. ఈ సందర్భంగా పొన్నపల్లి మాట్లాడుతూ, ఆంగ్లభాష మోజులో పడి తెలుగు భాషను మరిచిపోతున్నామని, ఉపాధి కోసం ఆంగ్లం అవసరమైనప్పటికీ సంతానానికి తెలుగు మాట్లాడటం నేర్పించాలన్నారు. కార్యక్రమంలో మాచిరాజు రామకృష్ణమూర్తి, సత్యనారాయణ, సృజన, రవికుమార్, నారాయణరావు, గంటయ్య, హరనాథబాబు, హృదయరాజు తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న సబ్ కలెక్టర్, తహసీల్దార్

ఓటు హక్కు వినియోగించుకోవాలి

● సబ్ కలెక్టర్ సంజనా సింహ

తెనాలి అర్బన్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని సబ్ కలెక్టర్ సంజన సింహా కోరారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలపై అవగాహన కల్పిస్తూ పట్టణంలో శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ ప్రారంభించి మాట్లాడుతూ, ఈ నెల 27న కృష్ణా గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గానికి ఎన్నిక జరుగుతుందన్నారు. ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు ఓటు వేసే అవకాశం ఎన్నికల కమిషన్ కల్పించిందన్నారు. ఆయా పోలింగ్ కేంద్రాలలో దరఖాస్తుచేసిన ఓటును పరిశీలించుకుని ఓటు వేయాలన్నారు. ఉద్యోగులకు ప్రభుత్వం ఓటు వేసేందుకు అనుమతి, సెలవు కూడా మంజూరు చేసిందన్నారు. ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా ఓటు వేయాలని, ప్రాధాన్య క్రమంలో పోలింగ్ కేంద్రంలో ఇచ్చే పెన్నుతో క్రమసంఖ్య వేయాల్సి ఉంటుందన్నారు. తహసీల్దార్ గోపాలకృష్ణ, రెవెన్యూ, మునిసిపల్ అధికారులు పాల్గొన్నారు.



జీవ ధ్వజస్తంభ ప్రతిష్ఠలో పాల్గొన్న భక్తులు

దండమూడిలో భక్తిశ్రద్ధలతో ధ్వజ ప్రతిష్ఠ

పొన్నూరు టౌన్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని దండమూడి గ్రామంలోని భీమలింగేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం జీవధ్వజ, రాహుకేతు విగ్రహాల పునఃప్రతిష్ఠ మహోత్సవం భక్తి శ్రద్ధలతో జరిగింది. గంగా కనకదుర్గా సమేత భీమలింగేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు జరిగాయి. భక్తుల జయజయ ధ్వానాల నడుమ పునఃప్రతిష్ఠ మహోత్సవాలను నిర్వహించారు. ఆలయంలో శాంతి హోమం నిర్వహించారు. ఈ ప్రతిష్ఠ ఉత్సవాలకు దండమూడి పరిసర గ్రామాలకు చెందిన వేలాదిమంది భక్తులు హాజరుకాగా ఆలయ నిర్వాహకులు అన్నప్రసాదాన్ని వితరణ చేశారు.

కూలీలకు కొలతలు బట్టి వేతనం: ఏపీవో రవి

కొల్లిపర, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనుల్లో పాల్గొనే కూలీలకు కొలతలు బట్టి వేతనం ఇవ్వడం జరుగుతుందని ఏపీవో రవి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని వల్లభాపురం, మున్నంగి, అత్తోట, కొల్లిపర, దంతలూరు గ్రామాల్లో నిర్వహిస్తున్న ఉపాధిహామీ పనులను ఆయన పరిశీలించారు. కూలీలకు తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ పేదప్రజలు ఉపాధిహామీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉపాధిహామీ పథకం ద్వారా పేదప్రజల ఆర్థిక పరిస్థితి మెరుగుపడే అవకాశం ఉందన్నారు. ఉపాధి హామీ పనుల్లో పాల్గొనే కూలీలకు ప్రభుత్వం అనేక సౌకర్యాలు కల్పించినట్లు తెలియజేశారు. ఉపాధి హామీ పనులను నిర్ణీత సమయంలో పూర్తిచేయాలన్నారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్‌లు శ్రీనివాసరావు, వల్లభాపురం బుజ్జిబాబు, కోటేశ్వరరావు, సాగర్ తదితరులు పాల్గొన్నారు.



ఉపాధిహామీ పనుల్లో పాల్గొన్న కూలీలు

పారిశుధ్య పనులను పరిశీలించిన కమిషనర్

తెనాలి, మారీసుపేట, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక రజకపేటలోని 37వ వార్డులో జరుగుతున్న శానిటేషన్ పనులను మునిసిల్ కమిషనర్ బండి శేషన్న అధికారులతో కలసి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటి వద్దనే చెత్తను శానిటేషన్ సిబ్బందికి అందించాలని మూడు బుట్టల విధానాన్ని అనుసరించాలని సూచించారు. పట్టణాభివృద్ధికి ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతిరావు, మునిసిపల్ అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



శానిటేషన్ పనులను పరిశీలిస్తున్న కమిషనర్ శేషన్న, అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతిరావు తదితరులు

రుణాలను సక్రమంగా చెల్లించాలి

● డీఆర్‌డీఏ ఏపీఎం రమాదేవి

కొల్లిపర, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): బ్యాంకుల ద్వారా తీసుకున్న రుణాలను సక్రమంగా చెల్లించాలని డీఆర్‌డీఏ ఏపీఎం రమాదేవి సూచించారు. శుక్రవారం స్థానిక స్త్రీశక్తి భవనంలో డ్వాక్రా మహిళలతో ఆమె సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రమాదేవి మాట్లాడుతూ డ్వాక్రా గ్రూపు సభ్యులు పొదుపును సక్రమంగా చేసుకుంటే అధికంగా రుణాన్ని పొందటానికి అవకాశం ఉందన్నారు. డ్వాక్రా గ్రూపు సభ్యులు ఆదాయ అభివృద్ధి కార్యక్రమాలకు మాత్రమే బ్యాంకు రుణాలను వినియోగించాలన్నారు. స్వయం సహాయక సంఘ సభ్యులు ప్రతి నెలా సమావేశాన్ని ఏర్పాటు చేసుకోవాలన్నారు. అదేవిధంగా సమావేశాన్ని ఏర్పాటు చేసుకోవడం వలన సంఘాలు మరింత బలోపేతం అవటానికి అవకాశం ఉందన్నారు. సమావేశంలో సీసీలు విజయకుమార్, మధు, ఎమ్ఎస్‌ఏ సీతామహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ ఏపీఎం రమాదేవి

విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకోవాలి

● దుగ్గిరాల మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ సాంబిరెడ్డి

కొల్లిపర, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రమ శిక్షణతో చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని దుగ్గిరాల మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ వంగా సాంబిరెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని తూములూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో యాసరపు వినోద్‌కుమార్, డాక్టర్ రోజారాణి అందజేసిన 10వ తరగతి విద్యార్థులకు మెటీరియల్స్‌ను ఆయన పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు రాణి, టీడీపీ మండల అధ్యక్షుడు భీమవరపు చినకోటిరెడ్డి, టీడీపీ జిల్లా కార్యదర్శి కె.అమృతరాజు, టీడీపీ నాయకులు కొల్లి కోటిరెడ్డి, చాగంటి నారాయణరెడ్డి, తుమాటి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.